# తెలంగాణలో యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు గుడ్‌న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పోలీసు, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఐదేళ్ల వయోపరిమితి పెంపు మే 18, 2026 నుంచి అమల్లో ఉండగా.. తాజాగా మరో రెండేళ్లు అదనంగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా శాఖల్లో పోస్టులకు వయోపరిమితి పెంపు ఏడేళ్లకు చేరింది. ఈ నిర్ణయం ప్రస్తుతం పోలీసు రిక్రూట్‌మెంట్లకూ వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్






మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ప్రెస్‌మీట్..

- ఖరీదైన బ్రాండెడ్ కార్లు అద్దెకు తీసుకుని విలాసవంతమైన జీవనశైలి..
- పేట్ బషీరాబాద్ పోలీసులకు చిక్కిన ఇద్దరు నిందితులు అరెస్ట్ రిమాండ్..
- 20 మంది బాధితులు.. 35 - 40 తులాల బంగారం దోచుకున్నట్లు అంగీకారం..
- పత్రికా సమావేశంలో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు..



నిందితుల నుండి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు..

- స్నాప్‌చాట్ వేదికగా మహిళలకు గాలం వేసి పరిచయాలు పెంచుకునే ముఠా..!
- ధనవంతులుగా నమ్మించి, ఖరీదైన అద్దె కార్లతో విలాసవంతమైన జీవనశైలి..
- నమ్మకం కుదిరిన తర్వాత మహిళల బంగారు ఆభరణాలతో ఉడాయింపు..
- దొంగిలించిన బంగారాన్ని మార్కెట్‌లో గుట్టుగా విక్రయించే సహచరుడు..
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పేట్ బషీరాబాద్ పోలీసులు..
- నిందితులపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు..
- ఇంకా మరికొంతమంది బాధితులు ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు..

-4లో

## స్నాప్‌చాట్‌లో మహిళలకు వల..!

# సంపన్నులుగా పరిచాయాలు..!

### బంగారం దోపిడీయే లక్ష్యంగా మహిళలకు వల..

## త్రివర్ణ పతాకమే మన గర్వకేతనం..!




- దేశభక్తి చాటిన 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు..!
- హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో విద్యార్థులు ఉత్సాహభరితంగా ప్రదర్శన..
- దేశభక్తి భావాలను నింపుతూ ఘనంగా సైకిల్ ర్యాలీ నిర్వహణ..!
- జాతీయ గీతంతో మార్మోగిన ప్రాంగణం.. 150 ఎన్‌సీసీ క్యాడెట్ల జాతీయ గీతాలాపన..
- చేతిలో త్రివర్ణ పతాకం.. గుండెల్లో దేశభక్తి.. ర్యాలీతో జాతీయ పతాకంపై అవగాహన..
- వీధుల్లో దేశభక్తి నినాదాలు.. జాతీయ ఐక్యత, సమైక్యత, చాటిన విద్యార్థులు..
- యువతలో దేశభక్తి జ్వాల రగిలించిన ర్యాలీ..!

-5లో

# 'బయో ఎనర్జీ'పై కర్ణాటకతో కలిసి పనిచేస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** జీవ ఇంధన (బయో ఎనర్జీ) రంగంలో కర్ణాటకతో కలిసి పనిచేయడానికి, రాబోయే రోజుల్లో మరింత పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కర్ణాటక రాష్ట్ర బయో ఎనర్జీ అభివృద్ధి మండలి ఛైర్మన్ సుధీంద్ర శంషాబాద్ విమానాశ్రయంలో భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల్లో బయో ఫ్యూయల్ రంగ అభివృద్ధిపై ఇరువురు నేతలు చర్చించారు. కర్ణాటకలో బయో ఫ్యూయల్‌కు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని సుధీంద్ర భట్టి విక్రమార్కకు వివరించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్, బయో ఫ్యూయల్స్ అభివృద్ధి కోసం కర్ణాటకలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలను, ప్రతిపాదిత కొత్త బయోఎనర్జీ విధానాన్ని తెలిపారు. సుధీంద్ర వ్యక్తం చేసిన అభిప్రాయాలకు భట్టి సానుకూలంగా స్పందించారు. ఇలాంటి సహకారం ఇరు రాష్ట్రాల ఇంధన రంగాల అభివృద్ధికి పునాది వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# దేశ ప్రగతిని విపక్షాలు అడ్డుకుంటున్నాయి

### 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శ

### '21 ఏళ్లకే చట్టసభలకు' అంశంపై భేదాభిప్రాయం లేదు: బండి సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** : విదేశీ శక్తులతోపాటు స్వదేశంలోనే కొందరు భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని, దేశ ప్రగతిని అడ్డుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ, విమానాశ్రయాల సంఖ్య పెరుగుతుండటాన్ని జీర్ణించుకోలేకున్నారని ఆక్షేపించారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామివివేకానంద విగ్రహం వరకు హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్, జి.నగేశ్, భాజపా సీనియర్ నేతలు మురళీధర్‌రావు, అభయ్‌త్రిపాఠీ, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, సినీ నటులు సాయికుమార్, మంచు మనోజ్, ఫరియా అబ్దుల్లా సహా పలువురు పాల్గొన్నారు. జాతీయ జెండాలతో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో రక్తపాతం జరగాలని, ఉగ్రవాదం పెరగాలని కొన్ని ప్రతిపక్ష పార్టీలు కోరుకుంటున్నాయని విమర్శించారు. మజ్లిస్ పార్టీ నాయకులు వందేమాతరం గేయానికి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారని నిలదీశారు. జాతీయ జెండా కోసం ప్రాణత్యాగం చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం ఏబీవీపీ కార్యకర్త సామ జగన్‌మోహన్‌రెడ్డి త్యాగాన్ని అంతా స్మరించుకోవాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజలంతా కలిసికట్టుగా

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ముగిసిన కేసీఆర్ బావమరిది అంత్యక్రియలు

## కన్నీటిపర్యంతమైన మాజీ సీఎం దంపతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాస్‌రావు(65) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శుక్రవారం ముగిశాయి. అనారోగ్యంతో ఆయన గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. తండ్రి మరణవార్త తెలుసుకున్న శ్రీనివాస్‌రావు కుమారుడు వివేక్ అమెరికాలోని టెక్సాస్ నుంచి నగరానికి చేరుకున్నారు. కేసీఆర్ ఆయన భార్య పేట్‌బషీరాబాద్‌లోని జోగినపల్లి శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకని భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆ సమయంలో వివేక్‌ను చూసి కేసీఆర్ దంపతులు కన్నీటిపర్యంతమయ్యారు. మేనమామ భౌతికకాయానికి కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. సాయంత్రం తిరుమలగిరి టీచర్స్ కాలనీలోని స్వర్గధామంలో ఉన్న విద్యుత్తు దహనవాటిక వద్ద శ్రీనివాస్‌రావు అంత్యక్రియలు నిర్వహించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు శ్రీనివాస్‌రావుకు తుది వీడ్కోలు పలికారు.






మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ప్రెస్‌మీట్..

- ఖరీదైన బ్రాండెడ్ కార్లు అద్దెకు తీసుకుని విలాసవంతమైన జీవనశైలి..
- పేట్ బషీరాబాద్ పోలీసులకు చిక్కిన ఇద్దరు నిందితులు అరెస్ట్ రిమాండ్..
- 20 మంది బాధితులు.. 35 - 40 తులాల బంగారం దోచుకున్నట్లు అంగీకారం..
- పత్రికా సమావేశంలో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు..

- స్నాప్‌చాట్ వేదికగా మహిళలకు గాలం వేసి పరిచయాలు పెంచుకునే ముఠా..!
- ధనవంతులుగా నమ్మించి, ఖరీదైన అద్దె కార్లతో విలాసవంతమైన జీవనశైలి..
- నమ్మకం కుదిరిన తర్వాత మహిళల బంగారు ఆభరణాలతో ఉడాయింపు..
- దొంగిలించిన బంగారాన్ని మార్కెట్‌లో గుట్టుగా విక్రయించే సహచరుడు..
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పేట్ బషీరాబాద్ పోలీసులు..
- నిందితులపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు..
- ఇంకా మరికొంతమంది బాధితులు ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు..

# స్నాప్‌చాట్‌లో మహిళలకు వల..!

# సంపన్నులుగా పరిచాయాలు..!

## బంగారం దోపిడీయే లక్ష్యంగా మహిళలకు వల..



నిందితుల నుండి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు..

నిందితుల నేర చరిత్ర, వారు అనుసరించిన విధానం, ఇప్పటివరకు గుర్తించిన బాధితుల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు.. మరికొంతమంది బాధితులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.. ఈ కోణంలో దర్యాప్తును విస్తరించారు.. నిందితులు ఎక్కడెక్కడ మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు..? ఎంతమంది నుంచి బంగారం దోచుకున్నారు..? దోచుకున్న బంగారాన్ని ఎక్కడ విక్రయించారు..? ఈ నేరాల్లో మరెవరైనా సహకరించారా..? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.. సోషల్ మీడియాలో పరిచయం.. ఖరీదైన కార్లతో హంగామా.. నమ్మకం పెంచుకుని బంగారం దోపిడీ.. ఇలా సాగిన ఈ ముఠా వ్యవహారం ప్రస్తుతం పేట్ బషీరాబాద్ పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి వచ్చింది. మరిన్ని వివరాలు విచారణ పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది..

### స్నాప్‌చాట్‌లో పరిచయం.. ఆపై నమ్మకం..

పోలీసుల వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు సాగర్ చౌదరి అలియాస్ సాయి సునీల్ స్నాప్‌చాట్ వేదికగా మహిళలను గుర్తించేవాడు. వారికి పరిచయం ఏర్పరచుకుని, క్రమంగా సాన్నిహిత్యాన్ని పెంచుకునేవాడు. తాను సంపన్నుడిననే భావన కలిగించేందుకు ఖరీదైన కార్లలో తిరుగుతూ విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించేవాడు.. దీంతో బాధితులు అతడిని పూర్తిగా నమ్మేలా చేసుకున్న తర్వాత.. వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని పరారయ్యేవాడని పోలీసులు తెలిపారు..

### దొంగిలించిన బంగారం.. సహచరుడి ద్వారా విక్రయం..

ప్రధాన నిందితుడు మహిళల నుంచి బంగారు ఆభరణాలను దోచుకున్న అనంతరం వాటిని తన సహచరుడు శివంగుళా భరత్ కుమార్‌కు అప్పగించేవాడని పోలీసులు తెలిపారు. వ్యాపార నేపథ్యం ఉన్న భరత్ కుమార్.. దొంగిలించిన బంగారాన్ని మార్కెట్‌లో త్వరగా విక్రయించి, సహకరించినట్లు విచారణలో వెల్లడైంది.. ఈ ముఠా మోసాలపై దర్యాప్తు చేపట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు ఇప్పటివరకు 20 మంది బాధితులను గుర్తించారు. నిందితుల విచారణలో 35 నుంచి 40 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని, వాటిని విక్రయించినట్లు అంగీకరించారని పోలీసులు వెల్లడించారు.. అయితే ఈ సంఖ్య ఇంతటితో ఆగే అవకాశం లేదని పోలీసులు భావిస్తున్నారు.. నిందితులు వివిధ ప్రాంతాల్లో ఇలాంటి మోసాలకు పాల్పడి ఉండొచ్చనే అనుమానంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు..



స్వాధీన పరచుకున్న సెల్ ఫోన్‌లు..

### గతంలోనూ వరుస నేరాల వివరాలు..

నిందితుల విచారణలో, గతంలోనూ పలు కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మోసం, దొంగతనం తదితర నేరాలకు సంబంధించి కేసులు నమోదైనట్లు తెలిపారు.

(1)..క్రైమ్ నెం. 307/2025 – BNS సెక్షన్లు 318(4), 303(2) – ఆర్‌సీ పురం పోలీస్ స్టేషన్..

(2)..క్రైమ్ నెం. 895/2026 – BNS సెక్షన్లు 318(4), 303(2) – ఎల్.బి. నగర్ పోలీస్ స్టేషన్.

(3)..క్రైమ్ నెం. 890/2026 – BNS సెక్షన్లు 318(4), 303(2) – ఆర్‌సీ పురం పోలీస్ స్టేషన్..

(4)..క్రైమ్ నెం. 209/2023 – IPC సెక్షన్లు 406, 420 -- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్.

(5)..క్రైమ్ నెం. 159/2025 – BNS సెక్షన్లు 64, 308(2). ఈ కేసులో ప్రధాన నిందితుడు సాగర్ చౌదరి గతంలో కస్టడీకి రిమాండ్ అయినట్లు పోలీసులు తెలిపారు..

(6)..క్రైమ్ నెం. 342/2026లో కేసు నమోదుప్రస్తుత ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 342/2026 కింద కేసు నమోదు చేశారు...

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 318(4) (మోసం), సెక్షన్ 303(2) (దొంగతనం), సెక్షన్లు 75, 78తో పాటు ఇతర సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 14:**
సోషల్ మీడియాను అడ్డాగా చేసుకుని మహిళలను పరిచయం చేసుకోవడం.. తాము కోటీశ్వరులమన్నట్లుగా, నమ్మించేందుకు విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించి.. పూర్తిగా నమ్మకం కలిగించడమే.. ఈ విధంగా మహిళలకు వలవేస్తూ, వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలతో ఉడాయించడం ఈ దొంగల ప్రత్యేకత.. దొంగిలించిన బంగారాన్ని మరో వ్యక్తి ద్వారా మార్కెట్‌లో విక్రయించి, ఆభరణాల ఆనవాళ్లు లేకుండా చేస్తారట.. ఇదీ పేట్ బషీరాబాద్ పోలీసులకు చిక్కిన ఇద్దరు సభ్యుల ముఠా మోసాల తీరుపై, మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్నాప్‌చాట్(యాప్) ద్వారా మహిళలను టార్గెట్ చేస్తూ వరుస మోసాలకు పాల్పడుతున్న ముఠాను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసులు ఛేదించారు.. ఈ కేసులో 25 ఏళ్ల ప్రధాన నిందితుడు సాగర్ చౌదరి అలియాస్ సాయి సునీల్‌తో పాటు అతని సహచరుడు శివంగుళ భరత్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటివరకు 20 మంది బాధితులను గుర్తించిన పోలీసులు.. 35 నుంచి 40 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని, వాటిని విక్రయించి, నగదుతో జల్సాలు చేసినట్టు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు..

# దేశ ప్రగతిని విపక్షాలు అడ్డుకుంటున్నాయి

-3 పేజి తరువాయి
ముందుకు వెళ్తూ.. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

**జెన్‌జీలకు మంత్రులుగా అవకాశం ఇవ్వాలి: బండి సంజయ్**

21 ఏళ్లకే చట్టసభలకు పోటీచేసే అవకాశం కల్పించాలనే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అంతకంటే ముందు జెన్‌జీలకు మంత్రులుగా అవకాశం కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులోనూ ప్రాధాన్యం ఇవ్వాలి.

**దేశ సమగ్రత కోసం కలిసికట్టుగా నడవాలి: ఎన్.రామచందర్‌రావు**

దేశం కోసం త్యాగాలు చేయాలనే స్ఫూర్తిని ప్రతిఒక్కరు పెంపొందించుకోవాలి. జాతీయ ఐక్యత, దేశ సమగ్రత కోసం కలిసికట్టుగా?

పనిచేయాలి. హర్‌ఘర్ తిరంగా యాత్రలో పెద్దసంఖ్యలో యువత, విద్యార్థులు పాల్గొనడం..దేశం కోసం యువత అండగా నిలుస్తుందనే విశ్వాసాన్ని కలిగించింది.

- దేశభక్తి చాటిన 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు..!
- హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో విద్యార్థులు ఉత్సాహభరితంగా ప్రదర్శన..
- దేశభక్తి భావాలను నింపుతూ ఘనంగా సైకిల్ ర్యాలీ నిర్వహణ..!
- జాతీయ గీతంతో మార్మోగిన ప్రాంగణం.. 150 ఎన్‌సీసీ క్యాడెట్ల జాతీయ గీతాలాపన..
- చేతిలో త్రివర్ణ పతాకం.. గుండెల్లో దేశభక్తి.. ర్యాలీతో జాతీయ పతాకంపై అవగాహన..
- వీధుల్లో దేశభక్తి నినాదాలు.. జాతీయ ఐక్యత, సమైక్యత, చాటిన విద్యార్థులు..
- యువతలో దేశభక్తి జ్వాల రగిలించిన ర్యాలీ..!



పేట్ బషీరాబాద్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థుల హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 14:** దేశభక్తి, జాతీయ సమైక్యత, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని చాటుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం పేట్ బషీరాబాద్‌లో సైకిల్ ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు.. విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించడంతో పాటు, ప్రజల్లో జాతీయ జెండా ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు సమష్టిగా జాతీయ గీతాన్ని ఆలపించారు. సుమారు 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ గీతం కార్యక్రమంలో పాల్గొని దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవాన్ని చాటారు. జాతీయ గీతం అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు హర్ ఘర్ తిరంగా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.



# త్రివర్ణ పతాకమే మన గర్వకేతనం..!

ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయాలని, త్రివర్ణ పతాకం పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావాన్ని కలిగి ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దేశం, జాతీయ పతాకం, జాతీయ సమైక్యత పట్ల బాధ్యతను ప్రతి పౌరుడు గుర్తించాల్సిన అవసరాన్ని విద్యార్థులు తమ ర్యాలీ ద్వారా చాటిచెప్పారు.. యువతలో దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించడంతో పాటు, సమాజంలో జాతీయ ఐక్యత, దేశం పట్ల బాధ్యత, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని బలపరిచేలా ఈ సైకిల్ ర్యాలీ సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..దేశభక్తి, జాతీయ ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు


150 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌ల సైకిల్ ర్యాలీ..




---


ఏసిపి శంకర్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న పాఠశాల పేరెంట్స్ కమిటీ..

- రూ.2 లక్షలతో 20 కెమెరాలు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థి ఏరోళ్ల క్రాంతి కిరణ్..
- విద్యార్థుల భద్రతే లక్ష్యంగా పాఠశాల ప్రాంగణంలో నిఘా వ్యవస్థ పటిష్ఠం..
- అవాంఛనీయ ఘటనలకు చెక్ పెట్టేలా నిరంతర నిఘా ఉంటుందని ఏసీపీ వెల్లడి..
- పూర్వ విద్యార్థి సేవాభావానికి ప్రశంసలు తెలిపిన అధికారులు, పాఠశాల సిబ్బంది..


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ వర్ధన్..

# జీడిమెట్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు.. భద్రతా వలయం..!


- పాఠశాల మొత్తం 20 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు..!
- సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏసీపీ శంకర్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ విజయ్ వర్ధన్..
- పాఠశాల కమిటీ సభ్యులు ఏసిపి శంకర్‌రెడ్డికి శాలువాతో సత్కారం..

**జీడిమెట్ల, పెన్ పవర్, ఆగష్టు 14:** విద్యార్థుల భద్రతతో పాటు పాఠశాల పరిసరాల్లో నిఘా పెంచేందుకు జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.. అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ఏరోళ్ల క్రాంతి కిరణ్ తన సొంత నిధులతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఈ సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని అధికారులు, పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.. సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేడ్చల్--పేట్ బషీరాబాద్ ఏసీపీ శంకర్ రెడ్డి, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ వర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై కెమెరాలను ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు విద్యార్థుల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పూర్వ విద్యార్థి ఏరోళ్ల క్రాంతి కిరణ్ సుమారు రూ.2 లక్షల నిధులతో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత కోసం ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా కొనసాగించేందుకు కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.. అనంతరం పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌స్పెక్టర్ విజయ్ వర్ధన్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతతో పాటు పాఠశాల ఆస్తుల పరిరక్షణకు కూడా ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థిగా రూ.2 లక్షల విలువైన సీసీ కెమెరాల వ్యవస్థను అందించిన ఏరోళ్ల క్రాంతి కిరణ్‌ను ఆయన అభినందించారు..



# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి!

**హైదరాబాద్, ఆగస్టు 14 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే



సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

**హైదరాబాద్, ఆగస్టు 14 పెన్ పవర్:**
రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు.ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినపుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది.కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది.సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

# తెలంగాణలోనూ మఖానా సాగు

**హైదరాబాద్, ఆగస్టు 14 పెన్ పవర్:**
వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బిహార్ ఆసక్తి చూపగా.. బిహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది.ఈ మేరకు బిహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బిహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025–26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బిహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు.మరోవైపు బిహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బిహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బిహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బిహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

# ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 14 పెన్ పవర్:**
తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమెటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

## ఈ కేవైసీకి మరో రోజే...

**హైదరాబాద్, ఆగస్టు 14, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సింది. అయితే ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఇప్పటి వరకు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ ఫోన్ నుంచి ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈ–కేవైసీ చేసుకునే సదుపాయాన్ని చమురు కంపెనీలు కల్పిస్తున్నాయి. ఎల్‌పీజీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా? అనే విషయాన్ని ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడం ఈ–కేవైసీ ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వం గతంలో స్పష్టం చేసిన ప్రకారం.. ఈ ప్రక్రియను డెలివరీ సిబ్బంది ద్వారా, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత కంపెనీ మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.మొబైల్ ద్వారా ఈ–కేవైసీ చేయాలంటే మీ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇండేన్ వినియోగదారులు'ఇండియన్ ఆయిల్ వన్' యాప్, భారత్ గ్యాస్ వినియోగదారులు 'హలో బీపీసీఎల్', హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు 'హెచ్ పీ పే' యాప్‌ను ఉపయోగించవచ్చు. వీటితో పాటు ముఖ గుర్తింపు ద్వారా ఆధార్ ధ్రువీకరణ కోసం 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ అవసరం అవుతుంది.ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు అయితే ముందుగా 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్‌ను ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత 'ఈ కేవైసీ' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అవసరమైన వివరాలను పరిశీలించిన తర్వాత నిబంధనలకు అంగీకారం తెలిపి ఫేస్ స్కాన్ ప్రారంభించాలి. ఆ సమయంలో 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ తెరుచుకుంటుంది. స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటిస్తూ కెమెరా ముందు ముఖాన్ని చూపిస్తే ఫేస్ అథెంటికేషన్ పూర్తవుతుంది. అనంతరం ఈ–కేవైసీ అభ్యర్థనను సబ్మిట్ చేయాలి. మిగతా గ్యాస్ వినియోగదారులు కూడా ఇలాగే పూర్తి చేసుకోవచ్చు.ఫేస్ అథెంటికేషన్ సమయంలో మొబైల్ కెమెరా స్పష్టంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖంపై ఎక్కువగా నీడ పడకుండా తగిన వెలుతురు ఉండాలి. కెమెరా ముందు ముఖాన్ని సరిగ్గా ఉంచి స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటించాలి. ఆధార్ బయోమెట్రిక్స్ లాక్ చేసి ఉంటే అథెంటికేషన్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే ఎల్ పీజీ కనెక్షన్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు సరిగ్గా ఉండటం కూడా ముఖ్యమే.ఈ–కేవైసీ గడువుపై ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన తేదీలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 16 ఆగస్టు 2026 తేదీలను పేర్కొంటున్నారు. అయితే దీనిపై సంబంధిత డీలర్ ను సంప్రదించడం మంచిది.

## గ్రేటర్ పోరులో పార్టీలు...

**హైదరాబాద్, ఆగస్టు 14 పెన్ పవర్:**
తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు.ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

## మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

**మహబూబ్ నగర్, ఆగస్టు 14 ఎన్ పవర్:**
మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది.దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు.పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## డివైడర్ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

**మహబూబ్ నగర్ పెన్ పవర్:**
మహబూబ్నగర్ జిల్లా 44వ జాతీయ రహదారిపై భూత్పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పాండిచ్చేరి వెళ్తున్న బస్సు డివైడర్నుర్ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఘటనలో పదిమందికి గాయాలు అయ్యాయి. నలుగురి పరిస్థితి సీరియస్ గా వేంది. అందరిని జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు వున్నారు. ఎస్పీ జానకి .. ఘటన స్దలాన్ని పరిశీలించారు.

## గార్ల ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందిస్తున్న వార్డు సభ్యులు భారతి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 14:**
ఎనిమిదవ వార్డు తో పాటు గ్రామంలో మౌలిక వసతులు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం, బస్సు సౌకర్యం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ వార్డు సభ్యురాలు భారతి ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. వార్డులో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, డ్రైనేజీలు నిర్మించాలని దంపకం బజార్ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్త బోరు ఏర్పాటు చేయాలని, స్మశానవాటికలో పనిచేయని బోరును మరమ్మతు చేసి నీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఫిల్టర్ బెడ్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని కోరారు.అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని దీపాలను మరమ్మతు చేయాలని, వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ప్రతిరోజూ తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సొంత ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, చుట్టుపక్కల గ్రామాలకు అవసరమైన బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రజల రోజువారీ జీవనానికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించాలని భారతి కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బిజెపి నాయకులు దేవా తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలపై ఎమ్మెల్యే కు సిపిఎం వినతి పత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 14:**గార్ల సి హెచ్ సి హాస్పిటల్ లో డయాలసిస్ సెంటర్,శవ పరీక్ష కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి, సంబంధిత పారామెడిక్ సిబ్బందిని నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు. మండల పర్యటనకు శుక్రవారం వచ్చిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సిపిఎం ఆధ్వర్యంలో మండల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి హెచ్ సి హాస్పిటల్ లో మృతదేహాల భద్రత కోసం ఫ్రిజర్ బాక్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆక్సిజన్ ప్లాంట్ సక్రమంగా పనిచేసేందుకు, రోగుల వైద్యశీకు సరిపడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్,జనరేటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన అనస్తీషియా, గైనకాలజీ పరికరాలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రోగులకు అత్యవసర ఇ సి జి సేవలు అందించేందుకు ఈసీజీ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని, దంత వైద్యానికి సంబంధించిన పరీక్ష పరికరాలను కేటాయించాలని, అత్యవసర సేవల కోసం సి హెచ్ సి కి ప్రత్యేక అంబులెన్స్‌ను మంజూరు చేయాలని కోరారు. హాస్పిటల్లో అదనంగా ఐదుగురు వైద్యులను నియమించడం, రాంపురం కు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కు కృషిచేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యను శాలువ ను కప్పి ఘనంగా సత్కరించారు.వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు వి.పి. వెంకటేశ్వర్లు, ఏం నాగమణి,కె. సుజాత, ఎస్. నాగరాజు,బి. శ్రీను తదితరులు ఉన్నారు


## యోగి బాటలో సువేందు

**కోల్ కత్తా, ఆగస్టు 14, పెన్ పవర్:**
పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం.యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు.ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు.ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యులర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

## ఉత్సవాలకు ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ షాక్..ఇద్దరు కాలేజీ స్టూడెంట్స్ మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ని పుత్తూరులో తీవ్ర విషాదం నెలకొంది. ఉత్సవాల సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ షాక్ తగిలి ఇద్దరు విద్యార్థులు స్పాట్ లోనే చనిపోయారు. కళ్లముందే కుమారుల మృతిచెందడంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా పుత్తూరులో శుక్రవారం (ఆగస్టు14) తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ద్రౌపతమ్మ-ధర్మరాజుల ఉత్సవాల సందర్భంగా పుత్తూరులోని కె.ఎన్. రోడ్డులోని పూజా టెక్స్‌టైల్స్ దగ్గర ఫ్లెక్సీ కట్టేందుకు కొంతమంది విద్యార్థులు గుమిగూడారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ఐరన్ రాడ్ ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ తో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.మృతులను విగ్నేష్ (19), గోకుల్ (18)గా గుర్తించారు. మృతులిద్దరు స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## హై లెవెల్ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి: ఎమ్మెల్యే కోరం కనకయ్య



బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 14:** మహబూబాబాద్ జిల్లా రాంపురం గార్ల హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గార్ల మండలంలో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి, కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత సీతంపేట గ్రామంలో సర్పంచ్ గుగులోత్ వీర్యానాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు తడి, పొడి చెత్త సేకరణ కోసం బకెట్లను పంపిణీ చేశారు. గ్రామాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని తడి, పొడి చెత్తను వేరుగా చేసి పారిశుద్ధ సిబ్బందికి అందించాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి సీతంపేట గార్ల లో రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు అనంతరం గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే.. నూతన శవపరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారికి అందించే పౌష్టికాహారం నాణ్యతను తెలుసుకునేందుకు వంట గదిని తనిఖీ చేశారు. రోగులకు నాణ్యమైన ఆహారంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రాంపురం--గార్ల హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే మండల ప్రజల రవాణా కష్టాలు తీరడంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

పెద్దకిష్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్ సింగ్ నాయక్ తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, మినీ బ్యాంకును ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిల సహకారంతో రాంపురం గార్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన పాకాల చెక్ డ్యామ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పాకాల ఏటి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజల చిరకాల కలను నెరవేరుస్తామని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంతో రాంపురం మద్దివంచ పరిసర గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ద్వారా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారు లు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు.ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు వాస్తవ రూపం దాలుస్తున్నాయన్నారు.పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందని అన్నారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. హై లెవెల్ బ్రిడ్జి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య తో పాటుగా పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ లను సిపిఐ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ పర్యటనలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, గార్ల పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు శంషాద్ బేగం, ఎంపీడీవో మంగమ్మ, తహసీల్దారు శారద, వ్యవసాయ శాఖ అధికారి రామారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుండా వెంకట్ రెడ్డి, సర్పంచులు భానోత్ పార్వతి హతిరాం, బానోత్ మోతిలాల్, భూక్యరామ్ సింగ్, బట్టు అనిత వెంకటరావు, సుశీల, రమ్య, నాగార్జున, సరోజ, రవి, ప్రమీల, వీరన్న, కాంగ్రెస్ నాయకులు కిషన్, యాకూబ్ పాషా, అశోక్ బాబు, లాల్ కోల కుమార్, వైద్య సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, అధికారులు కార్యకర్తలు ఉన్నారు

## గార్లలో మిన్నంటిన 'హర్ ఘర్ తిరంగా రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**గార్ల పెన్ పవర్ ఆగస్టు 14:**
హర్ ఘర్ తిరంగాతో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ గార్ల మండల అధ్యక్షుడు నక్క శివకృష్ణ యాదవ్ అన్నారు.గార్ల మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మన జెండా మన గర్వం మన భారతం అనే నినాదంతో మువ్వన్నెల జెండాలు చేతబూని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత గార్ల పట్టణ పురవీధుల గుండా నెహ్రూ సెంటర్ వరకు దేశభక్తి గీతాలు, ఆలపిస్తూ భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

అనంతరం ఈ సందర్భంగా నక్క శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ దేశం కోసం, దేశ ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసే దిశగా దేశభక్తి జాతీయ ఐక్యతవెల్లివిరియాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించామని ప్రజల్లో దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ ర్యాలీలో బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి రావుక విమల్‌కుమార్ జైన్ పాల్గొని విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు వార్డు సభ్యులు భారతి బిజెపి పార్టీ నాయకులు దేవా వీరస్వామి బుచ్చిబాబు రాంబాబు గణేష్ విజయ్ సతీష్ వీరియా నాయక్ వాసు అజ్మీరా రాము తదితరులు పాల్గొన్నారు.

## ముత్తితండా సమస్యలు పరిష్కరించాలి

**గార్ల పెన్ పవర్ ఆగస్టు 14:** ముత్తితండా గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ముత్తితండా గ్రామ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు.
గ్రామంలో సైడ్ కాలువలు నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని, చెరువు కట్టపై నుంచి గ్రామానికి రహదారి నిర్మించాలని కోరారు. అలాగే చెరువు కట్ట వద్ద కల్వర్టు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ముత్తితండా నుంచి పోచారం గ్రామానికి రహదారి నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

# ఏబీవీకి ఏమైంది

**విజయవాడ, ఆగస్టు 14 పెన్ పవర్:** రాజకీయాల్లో శత్రువుకి శత్రువు మిత్రుడు కావడం ఎంత సహజమో, ఐడియాలజీ లేదా స్వప్రయోజనాల విషయంలో విభేదాలు వస్తే నిన్నటి మిత్రుడే నేడు తీవ్ర విమర్శకుడిగా మారడం కూడా అంతే సహజం. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ సరిగ్గా ఈ సమీకరణాల చుట్టూనే తిరుగుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో కక్షసాధింపు చర్యలకు గురయ్యారనే సానుభూతితో, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ శ్రేణులు.. నేడు ఆయన మారుతున్న వైఖరిని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నాయి ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌కు గురై, తీవ్ర కేసులను ఎదుర్కొన్న సమయంలో టీడీపీ శ్రేణులు, మీడియా ఆయనను ఒక బాధితుడిగా ' భావించి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగం ఆయనపై చూపిన కఠిన వైఖరిని తప్పుబడుతూ ఆయనకు సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై ఉన్న సీఐడీ కేసులు, విచారణలను పక్కనబెట్టి, ఆయన వివాదాలకు ముగింపు పలికి క్లీన్ చిట్ లభించేలా చట్టబద్ధమైన ఊరట నిచ్చింది. అయితే, ఆ తర్వాత ఏబీ వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న తీరు, ఆయన మాటల శైలి టీడీపీ క్యాడర్‌కు తీవ్ర మింగుడుపడటం లేదు.ఇటీవలి కాలంలో ఆయన ప్రభుత్వ ప్రాజెక్టులు, పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండటం చర్చనీయాంశమైంది. రాయలసీమ ప్రాజెక్టులైన కడప స్టీల్ ప్లాంట్‌పై స్పందిస్తూ.. అది కేవలం ఒక రోలింగ్ మిల్ మాత్రమేనని, సమగ్ర స్టీల్ ప్లాంట్ కాదంటూ ప్రెస్ మీట్లు పెట్టి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. గతంలో ఆయనను తీవ్రంగా వేధించిన, ట్రోల్ చేసిన వైఎస్సార్సీపీ సానుభూతి మీడియా ఛానెళ్లకు, యూట్యూబ్ వేదికలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ, కూటమి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టడం

ద్వారా ఆయన పూర్తిగా ప్రత్యర్థి ఫోల్డ్‌లోకి వెళ్లిపోయారనే భావన వ్యక్తమవుతోంది.వ్యక్తిగత అజెండాలు లేదా ప్రభుత్వంపై పెంచుకున్న తీవ్రమైన అసంతృప్తి వల్ల విచక్షణ కోల్పోయి, లేనిపోని అంశాలపై విమర్శలు చేస్తున్నారనే విమర్శలు ఆయనపై వస్తున్నాయి.

గతంలో ఆయన పడిన కష్టాలకు మద్దతుగా నిలిచి, ఆయనను నెత్తిన పెట్టుకున్న టీడీపీ క్యాడర్ ఇప్పుడు ఇలాంటి వ్యక్తినా మనం సమర్థించింది అని తీవ్ర అసంతృప్తితో ఉంది. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మారే వైఖరికి మధ్య ఉన్న సన్నని గీత దాటడం వల్ల ఏబీ వెంకటేశ్వరరావు తన సొంత విశ్వసనీయతను దెబ్బతీసుకున్నారు

# పాపం గోరంట్ల



**అనంతపురం, ఆగస్టు 14 పెన్ పవర్:** పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్.ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి.ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది.గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

# కుప్పం ఎయర్ పోర్టుపై తమిళ రాజకీయాల్లో చర్చ



**తిరుపతి, ఆగస్టు 14 పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకే ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డుపుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారుఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు

**విశాఖపట్టణం, ఆగస్టు 14 పెన్ పవర్:** విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిల పాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు.ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...

**తిరుపతి, ఆగస్టు 14 పెన్ పవర్:** మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ–2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది.ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

## తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్


**తిరుమల, ఆగస్టు 14 పెన్ పవర్:** తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు.తిరుపతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు. ఈ శ్రీపాదం, అచ్యుత భవనాలు తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు చొప్పున మొత్తం 1064 గదులు ఉంటాయి.. ఈ రెండు సముదాయాలలో కలిపి 10వేల మంది భక్తులకు వసతి కల్పించవచ్చు.అచ్యుతం, శ్రీపాదం వసతి సముదాయాల్లోని భవనాల్లో రిసెప్షన్, అన్నదానం, డార్మెటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.. దాదాపు 7వేల మంది భక్తులకు సరిపోయేలా లాకర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. ఈ రెండు వసతి సముదాయాల నిర్మించాలని 2022లో అప్పటి టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కానీ నిర్మాణ పనులు 2024 మార్చిలో ప్రారంభంకాగా.. 2026 ఏప్రిల్‌కు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు కాస్త ఆలస్యం కావడంతో బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం -

**విజయవాడ, ఆగస్టు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మీడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు.అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస సముదాయాలు, గుంటూరు సమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ 6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది.గతంలో 2014–19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ–వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది.ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు పంచడం చూడానికి సులువుగా కనిపించినా.. దీని వెనుక సంక్లిష్టమైన లీగల్ చిక్కులు ఉన్నాయి. పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీకి ఉన్న హక్కులు, రాష్ట్ర సీఐడీ పరిధిలోని చట్టం కింద ఉన్న అటాచ్‌మెంట్ల మధ్య సమన్వయం సాధించి ఆస్తులను రిలీజ్ చేయించడం. అగ్రిగోల్డ్ యాజమాన్యం వివిధ బ్యాంకుల వద్ద ఆస్తులను కుదువబెట్టి రుణాలు తీసుకుంది. వాటి కోసం డెట్ రికవరీ ట్రిబ్యునల్ ద్వారా బ్యాంకులు తమకే మొదటి హక్కు ఉందంటూ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ ప్రమోటర్ల కుటుంబ సభ్యులు, బెనామీల పేర్లపై పెట్టిన ఆస్తులపై వచ్చిన లీగల్ ఛాలెంజెస్ ను కూడా అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును వేగవంతం చేసి, కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా బాధితుల డేటాబేస్‌ను సరి చూస్తోంది. పెద్ద పెద్ద ల్యాండ్ పార్సెళ్లను చిన్న ప్లాట్లుగా విభజించి వేలం వేయడం ద్వారా ఎక్కువ రాబడి రాబట్టవచ్చని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం గనుక చట్టపరమైన అడ్డంకులను అధిగమించి, రాబోయే ఆరు నెలల గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేసి డిపాజిటర్ల చేతికి డబ్బులు అందిస్తే.. అది ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. దశాబ్ద కాలంగా నమ్మకం కోల్పోయిన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది కొండంత అండగా మారడమే కాకుండా.. కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మైలేజ్ తెచ్చిపెడుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# అమరావతిలో ఏం జరుగుతోంది.. న్యూయార్క్ టైమ్స్ సెన్సేషన్ స్టోరీ



రాజధాని అమరావతి నిర్మాణం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఆధునిక నగరంగా ప్రపంచస్థాయి నిర్మాణ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న అమరావతి భవిష్యత్తులో పట్టణ ప్రణాళికలకు రోల్ మోడల్ గా నిలవనుందని అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' ప్రత్యేక కథనం వెలువరించింది. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, సరికొత్త పట్టణ ప్రణాళికా ప్రయోగంగా అభివర్ణిస్తూ 'వన్ మేన్స్ క్విస్ట్ టు బుల్డ్ ఇండియాస్ మోస్ట్ లివబుల్ సిటీ' (భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరాన్ని నిర్మించడానికి ఒక వ్యక్తి చేస్తున్న ప్రయత్నం) శీర్షిక ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిని ప్రస్తావిస్తూ రాజధానిపై ఆర్టికల్ ప్రచురించింది.అమరావతి నగర నిర్మాణం భవిష్యత్ లో ప్రపంచ నగరాలకు దిశానిర్దేశం చేయనుందని న్యూయార్క్ టైమ్స్ అభిప్రాయపడింది. సున్నా నుంచి ఒక మహానగరాన్ని సృష్టించాలన్న సంకల్పం ఎంతటి అద్భుతాలను సృష్టిస్తుందో అమరావతి నిరూపిస్తోందంటూ వెల్లడించింది. దేశంలోని మహానగరాలు అన్నీ తీవ్రమైన కాలుష్యం, రద్దీ, సరైన ప్రణాళిక లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయని, ఈ తరుణంలో అమరావతి నగర రూపకల్పన ఇటు దేశానికి, అటు ప్రపంచ దేశాలకు ఒక సరికొత్త మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొంది. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయకుండా, దాదాపు 60 శాతం మేర పచ్చదనం నీటి వనరులతో కూడిన హరిత నగరంగా దీనిని తీర్చిదిద్దుతుండటం విశేషమంటూ ప్రశంసించింది. ప్రసిద్ధ అంతర్జాతీయ ఆర్కిటెక్ట్స్ ప్రణాళికలతో, సైక్లింగ్ లేన్లు, జలమార్గాలు, అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకుంటున్న తీరు భవిష్యత్ అర్బన్ ప్లానింగ్‌కు అసలైన బెంచ్‌మార్క్‌గా మారుతోందని స్పష్టం చేసింది.అదేవిధంగా భవిష్యత్ సాంకేతికతలకు నిలయంగా అమరావతిని మలుస్తున్నారని తెలిపింది. డిజిటల్, డీప్-టెక్నాలజీ రంగానికి పెద్దపీట వేస్తూ ఏర్పాటు చేస్తున్న 'క్వాంటం వ్యాలీ', దేశ విదేశాల నుంచి దిగ్గజ సాంకేతిక సంస్థలను, యువతను ఆకర్షిస్తోంది. నగరంలో ఏర్పాటవుతున్న అత్యాధునిక క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాలు అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగానే కాకుండా గ్లోబల్ నాలెడ్జ్ అండ్ ఎకనామిక్ హబ్‌గా ఉన్నతీకరిస్తున్నాయని పేర్కొంది. ఇటువంటి బహుముఖ ప్రణాళికే ప్రపంచ దేశాల మేధావులను ఆకర్షిస్తున్న ప్రధానాంశంగా చెబుతున్నారు.ఇక రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ ను కోల్పోయిన బాధలో రాష్ట్రానికి ఒక అద్భుత రాజధాని ఉండాలనే కసితో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ప్రశంసించింది. సుమారు 25 వేల మంది కార్మికులతో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేసింది. రాజధాని అమరావతికి రాజమార్గంగా చెబుతున్న సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ పనులను ప్రారంభించి, రాజధాని నగరాన్ని జాతీయ రహదారితో అనుసంధానం చేసిన రోజునే ప్రతిష్టాత్మక పత్రికలో సానుకూల కథనం ప్రచురితం కావడంపై ప్రభుత్వం ఆనందం వ్యక్తం చేస్తోంది. అమరావతి ప్రత్యేకతలను వివరిస్తూ న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

# విధి ప్లాన్ ఇదేనా? చిన్ననాటి స్నేహం... తర్వాత సిస్టర్స్‌గా రివీల్!



సినిమా కథల్లో మాత్రమే చూసే అద్భుతమైన విచిత్రాలు ఒక్కోసారి నిజ జీవితంలోనూ జరుగుతుంటాయి. చిన్నతనంలో విడిపోయి, వేర్వేరు ప్రాంతాల్లో పెరిగిన ఇద్దరు అమ్మాయిలు టీనేజ్ వయసులో కలుసుకుని ప్రాణస్నేహితులుగా మారారు. ఆ తర్వాత 15 ఏళ్ల పాటు అసలు సంబంధమే లేకుండా పోయారు. కానీ తీరా ఏళ్ల తర్వాత డీఎన్ఏ టెస్ట్ చేయించుకుంటే తాము స్నేహితులు కాదు, సొంత అక్కాచెల్లెళ్లమని తెలిసి షాక్ అయ్యారు. నెదర్లాండ్స్‌లో వెలుగు చూసిన ఈ నిజ జీవిత భావోద్వేగ కథ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.

**భారత్ నుంచి నెదర్లాండ్స్‌కు దత్తత:**

భారత్‌కు చెందిన మీనా (43), మినల్ (44) అనే ఇద్దరు చిన్నతనంలోనే అనాథలుగా మారి వేర్వేరు కుటుంబాలకు దత్తతగా వెళ్లారు. నెదర్లాండ్స్‌లోని రెండు వేర్వేరు కుటుంబాలు వీరిని పెంచుకున్నాయి. ఇక చిన్నతనంలో తమకు ఒకరి గురించి ఒకరికి ఎలాంటి సమాచారం లేదు. ఇక విధి ఆడిన విచిత్రమైన నాటకంలో భాగంగా, వీరిద్దరూ ఒకే దేశంలో వేర్వేరు ప్రదేశాల్లో తమ కొత్త కుటుంబాలతో కలిసి పెరిగి పెద్దయ్యారు.

**ఈవెంట్‌లో ఫ్రెండ్స్.. ఆపై కాంటాక్ట్ కట్:**

టీనేజ్ వయసులో నెదర్లాండ్స్‌లో జరిగిన ఒక ఈవెంట్‌లో మీనా, మినల్ అనుకోకుండా కలుసుకున్నారు. ఇక ఒకరి ఆలోచనలు, మనస్తత్వాలు ఒకరికి నచ్చడంతో ఇద్దరి మధ్య మంచి స్నేహం కుదిరింది. ఇక కొన్నాళ్ల పాటు ఎంతో ఆప్యాయంగా స్నేహితులుగా మెలిగిన వీరిద్దరూ, కాలక్రమేణా ఎవరి జీవితాల్లో వారు బిజీగా మారిపోయారు. అలా దాదాపు 15 ఏళ్ల పాటు ఒకరికొకరు కాంటాక్ట్‌లో లేకుండా దూరంగా ఉండిపోయారు.

**డీఎన్ఏ టెస్ట్‌తో వెలుగులోకి అసలు నిజం:**

పదిహేనేళ్ల విరామం తర్వాత, తమ మూలాల గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో ఇద్దరూ విడివిడిగా డీఎన్ఏ పరీక్షలు చేయించుకున్నారు. ఇక ఆ టెస్ట్ రిపోర్టులు చూసిన అధికారులు, వారిద్దరూ సాధారణ స్నేహితులు కాదు.. ఒకే తల్లి కడుపున పుట్టిన సొంత అక్కాచెల్లెళ్లని తేల్చి చెప్పారు. ఈ విషయం తెలిసి మీనా, మినల్‌తో పాటు వారిని పెంచిన కుటుంబ సభ్యులు కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. విధి రాసిన విచిత్రమైన కథనానికి ఈ అక్కాచెల్లెళ్ల అనుబంధమే ఒక పెద్ద నిదర్శనం. ఎంత దూరంలో పెరిగినా, పదిహేనేళ్లు ఒకరికొకరు కాంటాక్ట్‌లో లేకపోయినా రక్తం పంచుకు పుట్టిన బంధం చివరికి వారిని మళ్లీ ఒకే గొడుగు కిందకి చేర్చింది. ఇక పకడ్బందీ సినిమా కథను తలపించే ఈ హృదయపూర్వకమైన ఘటన సోషల్ మీడియాలో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది.

# అమెరికా-పాక్ బంధంలో కొత్త అడుగు.. కీలక రంగాల్లో సహకారానికి రూబియో హామీ



పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం అనగానే మనకు గుర్తొచ్చేది మిఠాయిల కంటే కూడా.. అమెరికా ఇచ్చే అభినందన సందేశాలే.. ఈసారి కాస్త కొత్తగా.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో గారు మైకు ముందుకు వచ్చి పాకిస్థాన్‌కు దండ వేసి మరీ శుభాకాంక్షలు చెప్పేశారు. "మా బంధం గట్టిది.. మేం ఇద్దరం కలిస్తే తిరుగులేదు" అంటూ సరికొత్త కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

పాకిస్థాన్‌తో కలిసి ప్రాంతీయ స్థిరత్వం, భద్రత కాపాడతామని రూబియో గారు నమ్మకంగా చెప్పారు. ప్రపంచంలో ఎక్కడ ఏ గొడవ ఉన్నా భద్రత గురించి మాట్లాడటంలో పాక్‌కు ఉన్న 'ప్రత్యేక అనుభవం' బహుశా అమెరికాకు బాగా నచ్చిందేమో.. దశాబ్దాలుగా నడుస్తున్న ఈ 'అమెరికా-పాక్' సీరియల్‌లో ఎన్ని డ్రామాలు ఉన్నా చివరకు మళ్లీ ఇద్దరూ ఒకే వేదికపైకి రావడం చూస్తుంటే ప్రేక్షకులకు కాస్త నవ్వు, మరికాస్త ఆశ్చర్యం కలగక మానవు.

**ఖనిజాలు, ఇంధనం... ఉగ్రవాదంపై 'ఉమ్మడి' పోరు**

ఈసారి కేవలం భద్రతే కాదు, పాకిస్థాన్ దగ్గర ఉన్న కీలక ఖనిజాలు, ఇంధన రంగాల్లోనూ పెట్టుబడులు పెడతామని అమెరికా బంపర్ ఆఫర్ ఇచ్చింది. పాక్‌లో ఉన్న వనరులను వెలికితీసి తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు వాడుకోవడంలో ట్రంప్-రూబియో మార్క్ తెలివితేటలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక ఉగ్రవాదంపై పోరాటం గురించి రూబియో మాట్లాడటమే అసలైన ట్విస్ట్.. పిల్లికి పాలు కాపలా పెట్టినట్లుగా.. ఉగ్రవాద నిర్మూలనకు పాకిస్థాన్‌తోనే కలిసి పనిచేస్తామని చెప్పడం చూస్తుంటే కామెడీ సినిమాల్లోని క్లైమాక్స్ సీన్ గుర్తొస్తుంది.

**ఒక్క మాటలో చెప్పాలంటే**

గతంలో ఎన్ని పాత విభేదాలు, అనుమానాలు ఉన్నా.. ఆర్థిక, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు రాగానే అవన్నీ గాల్లో కలిసిపోతాయని ఈ కొత్త బంధం నిరూపిస్తోంది.

**కొత్త ముసుగులో పాత వ్యాపారం?**

వాణిజ్యం, పెట్టుబడులు పెంచుకుని ఆర్థిక బంధాన్ని బలోపేతం చేస్తామంటూ అమెరికా పెద్ద మనసు చేసుకుంది. అప్పుల ఊబిలో ఉన్న పాకిస్థాన్‌కు ఇది తాత్కాలిక ఊరటనిచ్చినా ఉచితంగా ఇచ్చేది అమెరికా అసలే కాదు.. ఉగ్రవాదం, భద్రత, ఆర్థిక సహాయం అనే చట్రం చుట్టూ తిరిగే ఈ ఇరు దేశాల బంధం భవిష్యత్తులో ఏ తీరానికి చేరుతుందో చూడాలి. ఏదేమైనా ఈ సరికొత్త 'అమెరికా-పాక్ సమన్వయం' దక్షిణాసియా రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన ఎంటర్‌టైన్‌మెంట్‌కు బాటలు వేసింది!

# బుద్ధి మార్చుకోని ప్రజ్వల్ రేవణ్ణ.. జైలులోనూ అదే పాడు పని!

అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తీరులో ఏ మాత్రం మార్పు లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పనిమనిషిపై అత్యాచారం, మహిళలపై లైంగిక వేధింపుల కేసులో నేరం నిరూపితం కావడంతో బెంగళూరు జైలులో శిక్ష అనుభవిస్తున్న ప్రజ్వల్ రేవణ్ణ తాజాగా జైలులో అశ్లీల వీడియోలు చూస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన ఉంటున్న గదిలో ఇటీవల పోలీసులు తనిఖీ చేయగా, ఒక సెల్ ఫోన్, పెన్ డ్రైవ్ లభించినట్లు చెబుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో వెలుగుచూసిన ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.జైలులో ఖైదీల కదలికలపై నిఘా ఉంచే క్రమంలో, జైలు అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలో ప్రజ్వల్ రేవణ్ణ గదిలో ఫోను, అశ్లీల వీడియోల పెన్ డ్రైవ్ లభ్యమైనట్లు చెబుతున్నారు. ప్రజ్వల్ రేవణ్ణ ఉంటున్న బ్యారక్‌లో సోదాలు నిర్వహించినప్పుడు, ఆయన వద్ద రహస్యంగా దాచిన మొబైల్ ఫోన్ కనిపించిందని, జైలు నిబంధనల ప్రకారం ఖైదీలకు ఎలక్ట్రానిక్ పరికరాలు, ముఖ్యంగా కమ్యూనికేషన్ సాధనాలు కలిగి ఉండటం తీవ్రమైన నేరంగా చెబుతున్నారు. ఈ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు, అందులో ఎవరితోనైనా సంప్రదింపులు జరిపారా లేదా దర్యాప్తును ప్రభావితం చేసే డేటా ఏమైనా ఉందా అనే కోణంలో ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపినట్లు సమాచారం.



**భద్రతా వైఫల్యాలపై ప్రశ్నలు**

ఈ ఘటన జైలు పాలనలోని భద్రతా లోపాలను బట్టబయలు చేసిందని చెబుతున్నారు. అత్యంత కీలకమైన కేసులో నిందితుడి జైలు గదిలోకి ఫోన్ ఎలా చేరిందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. దీని వెనుక జైలు సిబ్బంది ఎవరైనా సహకరించారా, లేక భద్రతా వలయాన్ని దాటుకుని బయటి నుండి ఎవరైనా సరఫరా చేశారా అనే కోణంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం జైలు అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని అంటున్నారు.

కేసుపై ప్రభావం

ప్రజ్వల్ రేవణ్ణపై ఉన్న లైంగిక వేధింపుల కేసును స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కీలకమైన దర్యాప్తు దశలో ఉన్న సమయంలో, నిందితుడు బయటి ప్రపంచంతో ఫోన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాక్ష్యాలను తారుమారు చేయడానికి లేదా

బాధితులను బెదిరించడానికి ఈ ఫోన్‌ను వినియోగించారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

కాగా, ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేగుతోంది. ప్రతిపక్షాలు ఈ ఉదంతాన్ని ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొంటుండగా, కఠిన చర్యలు తీసుకుంటామని జైలు శాఖ ప్రకటించింది. నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను, ప్రజ్వల్ రేవణ్ణపై అదనపు క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయవాద వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ఘటన విచారణలో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, పోలీసుల నివేదికలో ఏ విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాల్సి ఉందని అంటున్నారు.

# బ్యాంకుల రికవరీకి గ్రీన్ సిగ్నల్? మాల్యా కేసులో బిగ్ టర్న్!



భారతదేశంలో వేల కోట్ల రూపాయల రుణాలను ఎగొట్టి లండన్‌కు పారిపోయిన ప్రముఖ పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా కేసులో ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం, విజయ్ మాల్యా మధ్య గత పదేళ్లుగా నడుస్తున్న ఆస్తుల రికవరీ వివాదానికి ఇక ముగింపు పలకాలంటూ బాంబే హైకోర్టు కీలక సూచనలు చేసింది. ఈ కేసు సుదీర్ఘంగా సాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని కోర్టు అభిప్రాయపడింది.

**బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు:**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వేలం వేసి రుణాలను రికవరీ చేసుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు గతంలో అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాలు పిటిషన్ దాఖలు చేశారు. ఇక జస్టిస్ మిలింద్ జాదవ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, కేసు దర్యాప్తు పురోగతిపై స్పష్టమైన వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

**వివాదానికి ముగింపు పలకాలన్న న్యాయస్థానం:**

ఈ విషయాన్ని ఇంకా పట్టుకుని కూర్చోకుండా త్వరితగతిన ముందుకు సాగాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బ్యాంకులు, ఈడీ మరియు ఇతర సంబంధిత వర్గాలు కలిసి కూర్చుని ఒక ఆచరణాత్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఇక కమర్షియల్ వివాదాన్ని ఏదో ఒక రకంగా త్వరగా ముగించాలని, తద్వారా బ్యాంకులు తమకు రావలసిన నిధులను మాల్యా ఆస్తులను విక్రయించి రికవరీ చేసుకునే దిశగా అడుగులు వేయవచ్చని కోర్టు అభిప్రాయపడింది.

**రూ.9,000 కోట్ల రుణాలు.. విదేశాలకు పరారీ:**

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ వ్యాపారం కోసం విజయ్ మాల్యా వివిధ భారతీయ బ్యాంకుల నుంచి దాదాపు రూ.9,000 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. ఆ రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ఆయనపై చట్టపరమైన కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి లండన్‌కు పారిపోయారు. దీంతో 2019లో భారత ప్రభుత్వం ఆయనను 'పరారైన ఆర్థిక నేరస్థుడిగా' ప్రకటించింది. చట్టం ప్రకారం ఆయన ఆస్తులను జప్తు చేసి, రుణాల రికవరీకి అధికారులు చర్యలు చేపట్టారు.

**భారత్‌కు రాకపై లండన్ కోర్టుల ఆంక్షలు:**

భారత్‌లో తనను ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించడాన్ని, అలాగే 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ మాల్యా హైకోర్టులో పిటిషన్లు వేశారు. అయితే ఈ పిటిషన్లపై విచారణ జరగాలంటే మాల్యా ముందుగా భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని హైకోర్టు స్పష్టం చేసింది. బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా ప్రస్తుతం భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు ఆయనను భారత్‌కు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం లండన్ అధికార వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది.మొత్తానికి పదేళ్లుగా ఊగిసలాడుతున్న విజయ్ మాల్యా ఆస్తుల జప్తు మరియు బ్యాంకుల రికవరీ వ్యవహారం ఇప్పుడు చివరి ఘట్టానికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఇక బాంబే హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలతో బ్యాంకులు తమకు రావలసిన వేల కోట్ల రుణాలను మాల్యా జప్తు చేసిన ఆస్తుల ద్వారా వేగంగా రికవరీ చేసుకునే అవకాశం లభించనుంది. రాబోయే రోజుల్లో ఈ రికవరీ ప్రక్రియ ఏ విధంగా ముగింపుకు వస్తుందో వేచి చూడాలి.

తీవ్ర ధ్రువీకరణ రాజకీయాల యుగంలో మరో అనివార్యమైన ఘర్షణాత్మక రాజకీయ ప్రదర్శనతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాయి. జులై 20న ప్రారంభమైన సమావేశాలు ఆగస్టు 13న ముగిసేనాటికి, గతంలో ఎన్నో సమావేశాలు ఇంతకంటే అధ్వాన్నంగా జరిగాయన్న సంగతి ఏమాత్రం ఓదార్పు కాదు. ఉభయసభలు సజావుగా పనిచేసేలా సహేతుకమైన రాజీకి రావడంలో ప్రభుత్వం, ప్రతిపక్షం.. చూపిన మొండితనం, వైఖరిపరమైన సమస్యను బహిర్గతం చేస్తోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విద్యార్థి ఆందోళనలపై చర్చించే విషయంలో నెలకొన్న ప్రతిష్టంభన, చివరికి సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు ప్రతిపక్షాన్ని నిందిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. జంతర్‌మంతర్ ఆందోళనకారులపై, తర్వాత జార్ఖండ్ ఉద్యోగార్థులపై పోలీసు దురాగతంపై స్వేచ్ఛాయుత, నిష్కపటమైన చర్చకు ప్రభుత్వం మొదటినుంచీ వెనుకంజ వేయడం వల్లే, 12 బిల్లులు ఆమోదం పొందినా, ఉభయసభల్లో అర్థవంతమైన చర్చ జరిగింది కేవలం ఒక్క బిల్లుపైనే అనే దుస్థితికి కారణమైంది. లోక్‌సభ ఉత్పాదకత కేవలం 19 శాతానికి, రాజ్యసభ 39 శాతానికి పరిమితం కావడం గమనార్హం. దేశం తనను తాను పార్లమెంటరీ, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్రంగా గర్వంగా చెప్పుకోవాలంటే పార్లమెంటు సాధారణంగా పనిచేయడం అత్యంత ప్రాథమిక అవసరం. అయితే, అహంకార పూరిత ప్రవర్తనా సమస్య దీన్ని బందీగా మార్చేసింది. విద్యార్థి ఆందోళనలపై హింసాత్మక స్పందనకు బాధ్యతను తప్పించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే, నీట్, రాష్ట్ర నియామక పరీక్షా వ్యవస్థల విశ్వసనీయతపై ఆందోళనకారులు లేవనెత్తిన ప్రశ్నలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూసిన ప్రతిపక్షం కూడా ప్రతిష్టంభనలో భాగస్వామిగా నిలిచింది.

మూడు వారాలపాటు సాగిన నిరంతర నాటకంతో, చట్టసభ కార్యకలాపాలు నిర్వహించడానికి కనీస సభ్యతా ఒప్పందం లేకపోవడంపై ప్రజలు విసిగిపోయి ఉండొచ్చు. పార్లమెంటు నిర్వహణకు రోజుకు దాదాపు రూ.9 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కానీ ఇచ్చిపుచ్చుకునే మౌలిక స్ఫూర్తి సభాగృహాల నుంచి బయటకు వెళ్లిపోయినందుకు చెల్లించాల్సిన మూల్యమిదే. లోక్‌సభ కంటే రాజ్యసభ రెట్టింపు ఉత్పాదకతతో పనిచేయకపోతే, రాజ్యసభలో ప్రతిపక్ష నేత, దళిత సామాజిక వర్గానికి చెందిన మల్లికార్జున ఖర్గేను అవమానించిన ఘటన జాతీయస్థాయిలో వెలుగులోకి వచ్చేదే కాదు. ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదాన్‌లో ప్రసంగించిన వేదికపై, ఆయన ప్రసంగం అనంతరం 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించారన్న ఆరోపణ తీవ్ర దుమారం రేపింది. ఏ మతాన్నిగానీ, ఏ సామాజిక వర్గాన్నిగానీ తాను పేర్కొనలేదని, అయినా బీజేపీకి చెందిన వ్యక్తులు వేదికను శుద్ధి చేశారని, హవన్ నిర్వహించారని ఖర్గే రాజ్యసభలో ఆవేదన వ్యక్తం చేశారు. "ఇదేనా ప్రజాస్వామ్యం పనిచేసే తీరు? రాజ్యాంగాన్ని మీరు ఎలా కాపాడుతున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. అస్పృశ్యతా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సభానేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ, బీజేపీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని, ఈ ఘటనపై దర్యాప్తు చేపడతామని హామీ ఇచ్చారు. అధికార పార్టీ ఈ ఘటనను ఖండించి, దర్యాప్తునకు


## బాధ్యత ఇరువైపులా..

హామీ ఇచ్చినా, వేగంగా ఆధునికతవైపు అడుగులేస్తున్న దేశంలో ఇలాంటి వివక్షాపూరిత ఆచారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్న వాస్తవం ఏమాత్రం ఊరటనివ్వదు. కులాధారిత వివక్షనుంచి మనం ఇంకా పూర్తిగా విముక్తి పొందని సమాజంగానే మిగిలిపోయామన్న చేదు నిజాన్ని ఇది మరోసారి బయటపెట్టింది.

'వందేమాతరం' గీతాలాపన సమయంలో ప్రధాని మోదీతోసహా హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత ఖర్గేతోసహా అందరూ హాజరై, హుందాగా నిలబడటం ఒక వైరుధ్యంగా కనిపిస్తుంది. గీతాలాపన ముగిసిన వెంటనే విద్యార్థి ఆందోళనలపై సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్ష ఎంపీలు అమిత్ షాపై నినాదాలు చేయడం, "క్షమాపణ చెప్పండి", "లాఠీచార్జికి ఆదేశాలిచ్చింది ఎవరు" అని నినదించడం, అధికార పక్షం ప్రతి నినాదాలతో బదులివ్వడం జరిగింది. చివరికి స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సభా కార్యకలాపాలకు అన్యాయంగా అంతరాయం కలిగించినందుకు కాంగ్రెస్‌దే పూర్తి బాధ్యతని, ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నప్పుడు ప్రతిపక్షం చర్చనుంచి "పారిపోవడం" దేశ చరిత్రలో ఇదే మొదటిసారని విమర్శించారు. అయితే, ప్రభుత్వం నిజంగా చర్చకు సిద్ధంగా ఉంటే, విద్యార్థి ఆందోళనలపై పోలీసు బలప్రయోగంపై ఎందుకు నిష్కపటమైన చర్చకు వెనుకంజ వేసిందన్న విపక్ష ప్రశ్నకు సమాధానం లేదు. ఇరుపక్షాలూ ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ, తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే యత్నం చేయడమే ఈ మొత్తం వ్యవహారంలో కనిపిస్తోన్న వైఫల్య సారాంశం.

రాజ్యసభలో మైనింగ్ అండ్ మినరల్స్ సవరణ బిల్లువంటి కీలక బిల్లు గందరగోళం మధ్యే ఆమోదం పొందడం, సభ సజావుగా సాగకపోయినా ప్రభుత్వం తన అజెండాను ముందుకు నెట్టగలిగిందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. అంటే, అసలైన నష్టం ప్రభుత్వానికి కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకే వాటిల్లుతోంది. చర్చ లేకుండా బిల్లులు ఆమోదం పొందడం, ప్రతిపక్షం అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి తగినంత అవకాశం లభించకపోవడం, పార్లమెంటు అనే వేదిక తన అసలు ప్రయోజనాన్ని కోల్పోతున్న సంకేతం! దుమారం రేపిన అంశాలపై లోతైన చర్చ జరగకపోవడం వల్ల, వాటికి పరిష్కారం లభించకపోగా, ప్రజల్లో అపనమ్మకం మరింత పెరుగుతుంది. బాధ్యతల మారటానికే పరిమితం కాకుండా, ఇరు పక్షాలూ చట్టసభ కార్యకలాపాలను నిర్వహించే విషయంలో ఒక ఉమ్మడి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాల్సిన అవసరముంది. రాజకీయ విభేదాలను ప్రదర్శించడానికి చర్చలు, వాదోపవాదాలకు పూర్తి అవకాశం కల్పించే వేదికే పార్లమెంటు. ప్రజాస్వామ్యానికి నిలయమైన ఈ వేదికను, ప్రతిపక్షానికి సమాన స్థానం కల్పిస్తూ, దాని అసలైన ప్రయోజనం మేరకు పనిచేయనివ్వడంలో ఇరుపక్షాలూ కొంతమేర ఉమ్మడి భావనను కనుగొనాల్సిందే. లేకుంటే, ప్రతి సమావేశం ఇలాంటి నిందారోపణల నాటకంగానే ముగిసిపోతుంది, చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలు, వారి ఆకాంక్షలే. పార్లమెంటు వేదికగా విభేదాలను ప్రదర్శించడం ప్రజాస్వామ్య లక్షణమైతే, దాన్నే స్తంభింపజేయడం దాని పతనానికి నాంది!

## పనికొచ్చే పలుకు



# ఓవర్‌నైట్ సక్సెస్‌లు రియల్ కాదు బాస్!

రీల్స్‌లో చూసే "30 రోజుల్లో లైఫ్ ట్రాన్స్‌ఫార్మేషన్" థంబ్‌నెయిల్స్ చూసి, మనం కూడా అలాగే ఇన్‌స్టంట్‌గా విజయం సాధించాలని ఫీలవుతాం కదా? కానీ నిజం చెప్పాలంటే, అలాంటి ఓవర్‌నైట్ సక్సెస్ స్టోరీలు చాలావరకు ఎడిటింగ్ మ్యాజిక్కే తప్ప, రియాలిటీ కాదు. అమెరికన్ ఫిలాసఫర్ రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఏనాడో ఒక సాలిడ్ లైఫ్ లెసన్ డ్రాప్ చేశాడు: Adopt the pace of nature: her secret is patience. అంటే, ప్రకృతి వేగాన్ని ఫాలో అవ్వండి, దాని సీక్రెట్ పేషెన్స్ మాత్రమే. సింపుల్‌గా చెప్పాలంటే -హడావుడి పడకుండా, కన్సిస్టెంట్‌గా ఎఫర్ట్ పెడితేనే రియల్ గ్రోత్ వస్తుందని దాని అర్థం.


ఇప్పుడు మనం లివ్ చేస్తున్న instant gratification యుగంలో ఇది వినడానికి కొంచెం బోరింగ్‌గా అనిపించొచ్చు. ఆర్డర్ పెడితే 10 నిమిషాల్లో డెలివరీ వచ్చేస్తుంది. రీల్ పోస్ట్ చేస్తే వెంటనే లైక్స్ కౌంట్ కనిపిస్తుంది. దీంతో మన బ్రెయిన్ కూడా "ప్రతిదీ ఫాస్ట్‌గా జరగాలి" అని ఎక్స్‌పెక్ట్ చేయడం మొదలుపెట్టింది. కానీ స్కిల్స్ నేర్చుకోవడం, కెరీర్ బిల్డ్ చేసుకోవడం, రిలేషన్‌షిప్స్ బలపడటం -వీటన్నింటికీ టైమ్ పడుతుంది. ఇక్కడే చాలామంది జెన్-జీ ఫ్రెండ్స్ నిరాశపడిపోతున్నారు. "నేను ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నా, ఇంకా రిజల్ట్ కనిపించడం లేదు" అని ఫీలయ్యి, మధ్యలోనే క్విట్ చేసేస్తారు. కానీ విత్తనం మొక్కగా, మొక్క చెట్టుగా మారడానికి టైమ్ పడుతుంది బాస్. అండర్‌గ్రౌండ్‌లో వేర్లు బలంగా పాతుకుపోతున్నప్పుడు, మనకు పైకి ఏమీ కనిపించకపోవచ్చు, కానీ ఆ ఇన్విజిబుల్ వర్క్ ఎఫెక్టివ్ ఫౌండేషన్ కడుతూనే ఉంటుంది.

పేషెన్స్ అంటే చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. అది "పాసివ్ వెయిటింగ్" అస్సలు కాదు. "యాక్టివ్ ట్రస్ట్" -అంటే, రిజల్ట్ కనిపించకున్నా.. ప్రాసెస్‌పై నమ్మకంతో పని చేస్తూనే ఉండటం. జిమ్‌లో ఒక్కరోజు వర్కౌట్ చేస్తే సిక్స్-ప్యాక్ రాదు కదా. రెగ్యులర్‌గా, కన్సిస్టెంట్‌గా వెళ్తేనే బాడీ ట్రాన్స్‌ఫార్మ్ అవుతుంది. ఇక్కడా అంతే! స్కిల్ లెర్నింగ్ అయినా.. రిలేషన్‌షిప్ అయినా, పర్సనల్ గ్రోత్ అయినా -షార్ట్‌కట్‌లు కాదు, కన్సిస్టెన్సీయే కీ. షార్ట్‌కట్ ద్వారా వచ్చే సక్సెస్‌కి డెప్త్ ఉండదు. అది ఎప్పుడైనా కుప్పకూలొచ్చు. కానీ నెమ్మదిగా, స్టెడీగా బిల్డ్ చేసుకున్న దానికి ఒక సాలిడ్ వాల్యూ ఉంటుంది.

సో, తర్వాతిసారి "నా ఎఫర్ట్స్ ఏమీ వర్క్ అవ్వడం లేదు" అని ఫీలైనప్పుడు, ఒక్క క్షణం ఆగి ఆలోచించండి -మీరు నిజంగా ఫెయిల్ అవ్వడం లేదు, జస్ట్ ప్రకృతి రిథమ్‌లో ఉన్నారంతే. సోషల్ మీడియాలో కనిపించే హైలైట్ రీల్స్‌తో మీ బిహైండ్-ద-సీన్స్ స్ట్రగుల్‌ను కంపేర్ చేసుకోకండి. ప్రతి ఒక్కరి గ్రోత్ టైమ్‌లైన్ డిఫరెంట్. మీ పేస్‌ను రెస్పెక్ట్ చేయండి, ట్రస్ట్ ద ప్రాసెస్ -ఎందుకంటే, పేషెన్స్ అనేది వీక్‌నెస్ కాదు, ఇట్స్ యువర్ బిగ్గెస్ట్ సూపర్‌పవర్. ఫలితం లేటుగా వచ్చినా పర్వాలేదు, కానీ అది శాశ్వతంగా ఉంటుంది. అదే అసలైన విన్!

# వాస్తవాలు వర్సెస్ వదంతులు!

*ఏపీని సాంకేతిక పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి దార్శనికతకు ఉత్తరాంధ్ర డేటా సెంటర్లు కీలకం. రూ.2,08,406 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఇవి 21,627 ఉద్యోగాలు సృష్టించనున్నాయి. అయితే, ఈ అభివృద్ధిని అడ్డుకోవాలన్న దురుద్దేశంతో ప్రభుత్వ ప్రత్యర్థి వర్గాలు నీటి వినియోగంపై దుష్ప్రచారం సాగిస్తున్నాయన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన. కేవలం 3.5 టీఎంసీ నీటితోనే ఈ కేంద్రాలు నడుస్తాయని, పోలవరం కెనాల్ ద్వారా సమృద్ధిగా జలాలు అందుతాయని స్పష్టం చేస్తున్నారు. వాస్తవాలతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, యువతకు ఉద్యోగావకాశాలు దక్కేలా చూడాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉందన్నది సీఎం మాట.*




ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు, ఉత్తరాంధ్రలో ఏర్పాటవుతున్న భారీ డేటా సెంటర్లు కీలక మైలురాయిగా నిలవనున్నాయి. ఆగస్టు 12న జరిగిన 20వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (సిప్‌బి) సమావేశంలో రూ.2,08,406 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో అనకాపల్లి జిల్లాలో రీన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ ప్రతిపాదించిన రూ.85,200 కోట్ల ప్రాజెక్టు అతిపెద్దది. ఈ ప్రాజెక్టులు మొత్తంగా 21,627 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించనున్నాయి. అయితే, ఈ చారిత్రాత్మక పెట్టుబడుల ప్రవాహం మధ్యే, కొన్ని వర్గాలు సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, ఈ పరిశ్రమలను కాలుష్య కారకాలుగా చిత్రీకరిస్తున్నాయని సీఎం నాయుడు స్వయంగా ఆందోళన వ్యక్తం చేయడం చిన్న విషయం కాదు. ఈ దుష్ప్రచారాన్ని ఖచ్చితమైన గణాంకాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఉత్తరాంధ్రలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీ నీరు మాత్రమే అవసరమన్నది సీఎం మాట. ఇది రాష్ట్ర నీటి వనరులపై ఎలాంటి తీవ్ర ఒత్తిడి తీసుకురాని, హేతుబద్ధమైన స్థాయిలో ఉన్న అవసరం. అంతేకాక, విశాఖపట్నంలోని పరిశ్రమలకు పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా గురుత్వాకర్షణ పద్ధతిలో సమృద్ధిగా నీటిని సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలనీ సీఎం ఆదేశించారు -అంటే, నీటి లభ్యతపై ప్రభుత్వం ముందుచూపుతో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోందని ఇది స్పష్టం చేస్తోంది.

వాస్తవానికి, డేటా సెంటర్లు సంప్రదాయ భారీ పరిశ్రమల మాదిరిగా వాయు, జల కాలుష్యాన్ని వెదజల్లే యూనిట్లు కావు. ఇవి ప్రధానంగా సర్వర్లు, కూలింగ్ వ్యవస్థలతో నడిచే డిజిటల్ మౌలిక సదుపాయాలు. రసాయన వ్యర్థాలు, పొగ, దుర్వాసనలు వెలువరించే సంప్రదాయ ఫ్యాక్టరీలతో వీటిని పోల్చడం సరికాదు. ఆధునిక సాంకేతికతతో రూపొందించే ఈ కేంద్రాలు, సముద్రజలాల శీతలీకరణ వ్యవస్థలు వంటి పర్యావరణహిత పరిష్కారాలను వినియోగించుకునేలా రూపొందుతున్నాయి. దీనివల్ల మంచినీటి వినియోగంపై ఒత్తిడి మరింత తగ్గుతుంది. ఇంకా, గూగుల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తర్లువాడలో అమెరికా వెలుపల తమ అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకోవడం, ఏపీ సాంకేతిక పెట్టుబడులకు ఎంతటి విశ్వసనీయ కేంద్రంగా మారుతోందో నిరూపిస్తుంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడమంటే, కేవలం పెట్టుబడులు మాత్రమే కాదు -అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం, అంతర్జాతీయ ప్రమాణాలు, భవిష్యత్ తరం ఉద్యోగావకాశాలు కూడా వస్తాయని అర్థం. గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని, గ్రామీణ ప్రాంతాలకూ పారిశ్రామికీకరణ ఫలాలు అందేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం నాయుడు నొక్కిచెప్పడం, ఈ అభివృద్ధి కేవలం నగరాలకే పరిమితం కాకుండా, రాష్ట్రం మొత్తానికీ విస్తరించాలన్న ఆయన సమగ్ర దృక్పథాన్ని తెలియజేస్తుంది.

అయితే, ఏ కొత్త భారీ పరిశ్రమ వచ్చినా సహజంగానే స్థానికుల్లో నీటి లభ్యత, పర్యావరణ ప్రభావంపై సందేహాలు తలెత్తడం సహజం. ఇది ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన లక్షణమే. విశాఖపట్నం జిల్లాలో భూగర్భజలాల లభ్యత రాష్ట్రంలోనే అత్యల్పంగా ఉందన్న గణాంకాలు, పర్యావరణ కార్యకర్తలు, న్యాయవాదులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు కూడా ఇక్కడ ప్రస్తావించదగినవే. ఇలాంటి సందేహాలు వ్యక్తమైనప్పుడు, వాటిని నిర్లక్ష్యం చేయకుండా, శాస్త్రీయ డేటాతో, పారదర్శకంగా వివరణ ఇవ్వడమే సరైన మార్గం, సీఎం నాయుడు సరిగ్గా అదే చేస్తున్నారు. ప్రతి ప్రాజెక్టుకు నిర్దిష్ట నీటి అవసరాలను బహిరంగంగా ప్రకటించడం, ప్రత్యామ్నాయ నీటి వనరుల ప్రణాళికలను స్పష్టం చేయడం ద్వారా ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించవచ్చు. దురదృష్టవశాత్తూ, కొన్ని రాజకీయ శక్తులు, స్వార్థ ప్రయోజనాలు ఆశించే వర్గాలు ఈ సహజమైన సందేహాలను ఆసరాగా చేసుకుని, అర్ధసత్యాలు, అతిశయోక్తులతో కూడిన దుష్ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో వ్యవస్థీకృతంగా వ్యాప్తి చేయడం ఆందోళనకరం. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు తీసుకొచ్చే ప్రాజెక్టులను అడ్డుకోవాలన్న దురుద్దేశంతో సాగే ఇలాంటి ప్రచారాలు, చివరికి నష్టపోయేది సామాన్య యువతే, ఉద్యోగావకాశాలు కోల్పోయేది వారే. అభివృద్ధిని అడ్డుకోవడం ద్వారా ఎవరికి లాభం చేకూరుతుందో ప్రజలు ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ముందుచూపుతో కూడినదిగా కనిపిస్తోంది. దుష్ప్రచారాన్ని విస్మరించకుండా, వాస్తవాలతో ఎదుర్కోవాలన్న సీఎం నాయుడు నిర్ణయం హర్షణీయం. అధికారులు నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పించాలని, పారిశ్రామిక ప్రాజెక్టుల విలువను, అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణ వ్యవస్థకు చేకూర్చే ప్రయోజనాలను శాస్త్రీయంగా వివరించాలని నిర్దేశించడం, పారదర్శక పాలనకు నిదర్శనం! అంతేకాక, ప్రతి పరిశ్రమ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంత విలువను జోడిస్తుందో విశ్లేషించాలని అధికారులను ఆదేశించడం, కేవలం పెట్టుబడుల పరిమాణాన్నే కాకుండా, వాటి నాణ్యతను, దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోందని స్పష్టం చేస్తుంది. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, రాయలసీమ నుంచి ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా రోడ్డు, రైలు, పోర్టు అనుసంధానతను బలోపేతం చేయాలని ఆదేశించడం వంటివి, రాష్ట్రాభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న సమగ్ర దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులు కోరుకునే ప్రతి ఆంధ్రుడు ఇలాంటి దుష్ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాస్తవాలను తెలుసుకుని ముందుకు సాగాలి. రాష్ట్రాన్ని సాంకేతిక, పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ప్రజలంతా చేయూతనివ్వాల్సిన సమయమిది. వదంతులకు కాదు, వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన తరుణమిది!! ■



ఎప్పుడు అవకాశమొచ్చినా వెంటనే నవ్వండి. నవ్వును నలుగురితో పంచుకోండి. చిన్న చిరునవ్వు శరీరానికి కొత్త ఉత్సాహాన్నిస్తుంది. శరీరంలోని రసాయనిక వ్యవస్థను సానుకూలపరుస్తుంది. నవ్వినప్పుడు మెదడులో ఎండార్ఫిన్లు విడుదలై, ఒత్తిడి హార్మోన్ కార్టిజాల్ స్థాయిని తగ్గిస్తాయి. దీనివల్ల మనసు తేలికపడటమే కాదు, రోగనిరోధక శక్తి బలపడుతుంది. మీ నవ్వు చూసిన ఎదుటివారిలోనూ అదే సానుకూల భావన ప్రతిబింబిస్తుంది. నవ్వు అంటువ్యాధిలా వ్యాపిస్తుందని గుర్తుంచుకోండి. కాబట్టి, ఎంత బిజీగా ఉన్నా, ఎంత ఒత్తిడిలో ఉన్నా, ఒక నిజాయితీగల చిరునవ్వుకు క్షణం కేటాయించండి. అది మీకూ, చుట్టూ ఉన్నవారికీ మేలు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# ఆర్డర్ల ఆనందానికి అరదండం!



జపాన్‌లో వింత మోసం వెలుగులోకొచ్చింది. ఒసాకాకు చెందిన 32 ఏళ్ల మయు యోషిదా అనే రెస్టారెంట్ ఉద్యోగిని, జపాన్‌లోని అతిపెద్ద మంగా ప్రచురణ సంస్థ షూయిషాకు చెందిన ఆన్‌లైన్ స్టోర్‌లో ఏకంగా 238 వేర్వేరు ఖాతాల ద్వారా 2,000కు పైగా ఆర్డర్లు పెట్టింది. 2024-2025 మధ్య దాదాపు 4.3 బిలియన్ యెన్ల (సుమారు రూ.227 కోట్లు) విలువైన ఉత్పత్తులను ఆర్డర్ చేసిన ఆమె, ఒక్క పైసా కూడా చెల్లించలేదు. కన్వీనియన్స్ స్టోర్ ప్రీపేమెంట్ విధానాన్ని, క్యాష్-ఆన్-డెలివరీ ఆప్షన్‌ను ఆసరాగా చేసుకుని, డబ్బు చెల్లించకుండా ఆర్డర్లు రద్దయ్యేలా చేయడం లేదా వస్తువులు వచ్చాక తిరస్కరించడం ఆమె పద్ధతి. దీనివల్ల కంపెనీకి రవాణా ఖర్చుల రూపంలో దాదాపు 7.5 మిలియన్ యెన్ల (రూ.40 లక్షలు) నష్టం వాటిల్లింది. ఏడాదిపాటు సాగిన దర్యాప్తు అనంతరం మంగళవారం అరెస్టైన యోషిదా, తనకు కంపెనీపై ఎలాంటి కక్షా లేదని, కేవలం రోజువారీ ఒత్తిడిని తట్టుకోవడానికే వస్తువులు అమ్ముడుపోకముందే ఆర్డర్ చేయడంలో తనకు ఒక తృప్తి, ఉపశమనం లభించేదని అంగీకరించింది!

# సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం

తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!

సోరియాసిసకు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనొమినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిసను ప్రేరేపిస్తాయి.

**ప్రధాన లక్షణాలు ఇవే!**

దురద చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం

పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట

గోకినప్పుడు పొట్టు రాలడం రకాలున్నాయి సోరియాసిసలో ఐదు రకాలున్నాయి.

**అవేంటంటే...**

ఫ్లేక్ సోరియాసిస్: 80% సోరియాసిసలు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90% చర్మం సోరియాసిసకు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిసగా పరిగణించాలి.

**శాశ్వత చికిత్స లేదు**

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య, అకస్మాత్తుగా తిరబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిసకు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హెూమియోపతిలో సోరియాసిసకు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెసతో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

**నివారణ ఇలా...**

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.





# మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే గుండెపోటు వస్తుందా?

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండె సమస్యలకు కొత్త ప్రధాన ప్రమాద కారకంగా మారుతున్నాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం వంటివి ఇప్పటికే గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కానీ, నిపుణులు ఇప్పుడు ఒత్తిడి, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండెను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. డిప్రెషన్, ఆందోళన 50 శాతం గుండె సమస్యలను పెంచుతాయని ఆరోగ్య నిపుణులు షాకింగ్ విషయాలు వెల్లడించారు.

**మానసిక ఒత్తిడి గుండెను ఎలా ప్రభావితం చేస్తుంది?**

మనం దీర్ఘకాలిక ఒత్తిడి లేదా ఆందోళనలో ఉన్నప్పుడు, శరీరం కార్టిసాల్, కాటెకోలమైన్‌లు వంటి ఎక్కువ హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మిటర్‌లను (ఉదాహరణకు, అడ్రినలిన్) ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతాయి.

**గుండెపై ఒత్తిడి ప్రమాదాలు**

మానసిక ఒత్తిడి గుండెను నేరుగా ప్రభావితం చేయడమే కాకుండా, దాని ఇతర దుష్ప్రభావాలు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ఒత్తిడికి గురైనప్పుడు, వారు తరచుగా ఒకే చోట పడుకున్నట్లు లేదా కూర్చున్నట్లు భావిస్తారు. ఒత్తిడికి గురైన వ్యక్తులు తక్కువ చురుగ్గా ఉంటారు. వ్యాయామంపై కూడా దృష్టి పెట్టరు. ఎక్కువసేపు ఒత్తిడి ఉండటం లేదా శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె కండరాలపై ఒత్తిడి పెరిగి అవి బలహీనపడతాయి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

**అనారోగ్యకరమైన ఆహారం**


చాలా మంది ఒత్తిడిలో జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, స్వీట్లు ఎక్కువగా తింటారు. ఈ ఆహారాలు బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తీవ్రతరం చేస్తాయి, ఇది రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. గుండెను బలహీనపరుస్తుంది.

**నిద్రలేమి**

ఒత్తిడి, ఆందోళన నిద్రలేమికి దారితీయవచ్చు. దీని వలన రక్తపోటు పెరుగుతుంది. ఇది నేరుగా గుండెపై ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**మందులు తీసుకోకపోవడం**

రక్తపోటు లేదా మధుమేహం వంటి సమస్యలకు ఇప్పటికే మందులు తీసుకుంటున్న వారు, ఒత్తిడి కారణంగా మందులు వేసుకోకుండా ఇబ్బంది పడుతుంటారు. తరచుగా వారు మందులు సకాలంలో తీసుకోవడం మర్చిపోతారు. దీనివల్ల వ్యాధి అదుపు తప్పి తీవ్రమైన గుండె సమస్యలకు దారితీస్తుంది.



# వినికిడి లోపిస్తే



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు

వైద్యులు వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్తవచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్లు పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

**పిల్లల్లో వినికిడి లోపం**

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పుళ్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

**ఇది తాత్కాలికమే!**

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవి పోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

**అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...**

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరికాదు. ఇలాంటి సందర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.

# హై బీపీ సమస్య ఇబ్బంది పెడుతోందా?.. జస్ట్ ఈ సింపుల్ చిట్కాలు..

ప్రస్తుతం హై బీపీ సమస్య అందరిని ఇబ్బంది పెడుతోంది. వైద్యులు వద్దకు వెళ్లితే.. భారీగా ఫీజు వసూల్ చేస్తున్నారు. దీనితోపాటు అత్యంత ఖరీదైన మందులు రాస్తున్నారు. దీంతో జేబుకు చిల్లు.. అది కూడా గట్టిగా పడుతుంది. అయితే ఇంట్లోనే మనం తినే.. తీసుకునే ఆహారంలో కొద్ది పాటు మార్పులు చేర్పులతో ఈ హై బీపీ సమస్యను దాదాపుగా నియంత్రించువచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అందుకు ఆరు చక్కటి పరిష్కారాలను వారు సోదాహరణగా వివరిస్తున్నారు.



మొదటిది.. కీర దోసకాయ.. బీపీని నియంత్రించడానికి ఇది చాలా బాగా పని చేస్తుంది. కేజీ కీర దోసకాయ ఖరీదు చాలా స్వల్పంగానే ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. వీటిని రోజు తీసుకోవడం ద్వారా సులభంగా హై బీపీని నియంత్రివచ్చు.

రెండోవది.. రాతి ఉసిరి (ఆమ్లా).. ఇందులో ఎన్నో పోషకాలతోపాటు విటమిన్లు సైతం ఉంటాయి. ఇది సహజ సిద్ధంగా లభిస్తుంది. అంతేకాకుండా దీని వల్ల అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ఇది శరీరాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. అంటే శరీరంలోని విషాన్ని పూర్తిగా తొలగించే శక్తి.. ఈ రాతి ఉసిరికి ఉంది. ఈ రాతి ఉసిరి.. షుగర్, హై బీపీలను తగ్గించడమే కాకుండా బరువు తగ్గడంలో సైతం కీలకంగా వ్యవహరిస్తోంది.

మూడోవది అన్ని కూరగాయలు.. మరి ముఖ్యంగా బెల్ పెప్పర్స్ (సిమ్లా మిర్చి). ఇందులో రంగులు ఉంటాయి. అంటే పసుపు, ఎరుపు, పచ్చని క్యాప్సికమ్ మిర్చి లభిస్తుంది. ఏ రంగులో ఉన్న ఈ మిర్చి తీసుకున్నా.. బీపీ మాత్రం నియంత్రణలోకి వస్తుంది. అలాగే క్యారెట్ సైతం బీపీ తగ్గడానికి సహాయపడుతుంది.

నాలుగోది.. ముల్లంగి (ర్యాడిష్) ఇది కొద్దిగా ఘాటుగా ఉంటుంది. అందుకే దీనిని తినడానికి ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ దీనిని కూరగా చేసుకుని తీసుకుంటే మాత్రం చాలా మంచిది.

ఐదోవది.. మజ్జిగ (బటర్ మిల్క్): చాలా పల్చగా చేసుకుని మజ్జిగ తాగాలి. అందులో కొద్దిగా జీలకర్ర పొడితోపాటు సొంపు పొడి వేసుకుని తీసుకుంటే వెంటనే రిలీఫ్ ఉంటుంది. పేగులు సైతం ఆరోగ్యంగా ఉంటాయి.

ఆరోవది.. రాత్రి సమయంలో గ్లాస్ వాటర్ తీసుకోవాలి. టీ స్పూన్ సొంపు, జీలకర్ర, ఒక దాల్చిన చెక్కను నీటిలో వేసి నానబెట్టాలి. ఉదయం అందులో పొదీనా వేయాలి. ఈ మిశ్రమంలో ఆఫ్ టీ స్పూన్ ములగాకు పొడి కూడా వేసి బాగా మరిగించాలి. అనంతరం వడ పోసుకుని.. అందులో నిమ్మకాయ పిండుకుని తాగితే.. బీపీ వెంటనే కంట్రోల్ అవుతుంది. ఇది క్రమం తప్పకుండా ప్రతి రోజు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

# శ్రీలంకతో టెస్ట్ సిరీస్.. కెప్టెన్ గిల్ కీలక వ్యాఖ్యలు

- డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడమే లక్ష్యమన్న గిల్
- డబ్ల్యూటీసీ పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్
- బుమ్రా లేకపోయినా పేస్ విభాగంపై కెప్టెన్ విశ్వాసం
- ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌పై గిల్ ప్రత్యేక ప్రశంసలు
- గాలేలో గాలి దిశ కీలకమని గిల్ వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే తమ ప్రధాన లక్ష్యమని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. శ్రీలంకతో రేపు శనివారం గాలేలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం. గాలే వేదికగా జరిగే 50వ టెస్టు కూడా ఇదే.
ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే తొమ్మిది టెస్టుల్లో దాదాపు ఆరు లేదా ఏడు మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయని గిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది.
కాగా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత జట్టు ముందుగానే అక్కడికి చేరుకుంది. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తో సన్నాహక మ్యాచ్ ఆడింది. ఈ అదనపు సమయం ఆటగాళ్లకు పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడిందని గిల్ చెప్పాడు.
బుమ్రా లేకపోయినా భారత ఫాస్ట్ బౌలింగ్‌పై గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించాడు. గుర్నూర్ బ్రార్
కూడా పాత బంతితో మంచి బౌన్స్ రాబట్టగలడని పేర్కొన్నాడు. శ్రీలంకలో పిచ్ ల నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని.. అలాంటి పరిస్థితుల్లో విభిన్న వ్యూహాలతో ఒత్తిడి పెంచాల్సి ఉంటుందని చెప్పాడు.
దేవదత్ పడిక్కల్‌పై కూడా గిల్ ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇండియా-ఏ తరఫున శ్రీలంకలో ఆడిన అనుభవం అతడికి ఉపయోగపడుతుందని తెలిపాడు. గాలే లాంటి ఓపెన్ మైదానాల్లో గాలి దిశ బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుందని వివరించాడు.

# బీసీసీఐలో భారీ మార్పులు.. డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వీవీఎస్ లక్ష్మణ్?

సెప్టెంబర్ ఏజీఎంలో అధికారిక ప్రకటనకు అవకాశం
చీఫ్ సెలక్టర్ అగార్కర్ పదవీకాలంపైనా త్వరలో నిర్ణయం
గతంలో హెడ్ కోచ్ పదవిని తిరస్కరించిన లక్ష్మణ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలనా వ్యవస్థలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (సీవోఈ) అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్‌కు పదోన్నతి లభించనుంది. అతడిని 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' అనే కొత్త, శక్తిమంతమైన పదవిలో నియమించేందుకు బోర్డు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి.
ప్రస్తుతం లక్ష్మణ్ సీవోఈ (గతంలో జాతీయ క్రికెట్ అకాడమీ) హెడ్‌గా ఆటగాళ్ల పునరావాసం, శిక్షణ వంటి బాధ్యతలు చూస్తున్నాడు. 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమితులైతే, ఆయన పరిధి మరింత విస్తృతం కానుంది. సీనియర్ పురుషుల, మహిళల జట్ల వ్యూహరచన, జాతీయ సెలక్షన్ కమిటీతో సమన్వయం, జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయి వరకు ఆటగాళ్ల ప్రగతిని పర్యవేక్షించడం వంటి కీలక అధికారాలు ఆయన చేతికి వస్తాయి.
ఇదే సమయంలో, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం కూడా సెప్టెంబర్‌తో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని 2027 జూన్ వరకు పొడిగించాలా? లేక కొత్త వారిని నియమించాలా? అనే అంశంపై కూడా బీసీసీఐ చర్చిస్తోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంతో సమన్వయం కోసం లక్ష్మణ్ లాంటి అనుభవజ్ఞుడి సేవలు అవసరమని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.గతంలో రాహుల్ ద్రవిడ్ తర్వాత టీమిండియా హెడ్ కోచ్ పదవిని చేపట్టాలని బీసీసీఐ కోరినప్పటికీ, లక్ష్మణ్ సున్నితంగా తిరస్కరించాడు. బెంగళూరులోని నూతన సీవోఈ ప్రాజెక్టుపై దృష్టి సారించేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గాడిన పడటంతో, ఆయన అనుభవాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించుకునేందుకు బీసీసీఐ సిద్ధమైంది.


# ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర.. టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లా బ్యాటర్‌గా తన్జీద్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. యువ ఓపెనర్ తన్జీద్ హసన్ తమీమ్ చారిత్రక సెంచరీతో అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు అద్భుతమైన శతకం బాదిన తన్జీద్.. కంగారూల గడ్డపై టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను ఆడుతున్న రెండో టెస్టులోనే ఈ 25 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.
ఈ క్రమంలో 23 ఏళ్ల నాటి రికార్డును తన్జీద్ బద్దలు కొట్టాడు. 2003లో మాజీ ఓపెనర్ హన్నన్ సర్కార్ చేసిన 76 పరుగులే ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఒక బంగ్లా బ్యాటర్ చేసిన అత్యధిక స్కోరు. దానిని అధిగమిస్తూ తన్జీద్ 190 బంతుల్లో 101 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 బౌండరీలు, ఒక భారీ సిక్సర్ ఉన్నాయి.అంతకుముందు తొలి రోజు బంగ్లా పేసర్ హసన్ మహమూద్ (6/55) అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియాను కేవలం 198 పరుగులకే ఆలౌట్ చేసిన సంగతి తెలిసిందే. దీనికి సమాధానంగా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌కు తన్జీద్ వెన్నెముకగా నిలిచాడు. కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్‌లతో కూడిన ప్రపంచ స్థాయి ఆస్ట్రేలియా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండో ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో జీరో పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి బతికిపోయిన తన్జీద్, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మొమినుల్ హక్ (49)తో కలిసి రెండో వికెట్‌కు 102 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 188 బంతుల్లో తన తొలి టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత నాథన్ లియాన్ బౌలింగ్‌లోనే లాంగ్-ఆఫ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.
"ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఇది నాకు చాలా ప్రత్యేకం. నేను ప్రశాంతంగా ఉంటూ, సాధారణ క్రికెట్ షాట్లు ఆడేందుకు ప్రయత్నించాను" అని తన్జీద్ తెలిపాడు. మొత్తం మీద తన్జీద్ చారిత్రక ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఈ టెస్టులో పట్టు బిగించింది. ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయం సాధించే దిశగా ఆ జట్టు అడుగులు వేస్తోంది.

## శ్రీను వైట్ల మళ్లీ మెషిన్ కామెడీ పట్టుకున్నాడా?

శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్ మీద ఫిల్మ్ సర్కిల్స్ లో రకరకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమా పాయింట్ కి సంబంధించి బయటకు వచ్చిన కొన్ని రిపోర్ట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇందులో టైమ్ మిషన్ కు సంబంధించిన ఒక ఎలిమెంట్ ఉండబోతోందనే టాక్ గట్టిగా ప్రచారంలోకి వచ్చింది. అయితే మేకర్స్ నుంచి దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రమోషనల్ అప్డేట్ రాలేదు కాబట్టి, ఇది ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ కథా లేక కథలో ఒక భాగమా అనేది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.హీరో శర్వానంద్ ట్రాక్ రికార్డ్ గమనిస్తే ఆయన గతంలోనే 'ఒకే ఒక జీవితం' సినిమాతో టైమ్ ట్రావెల్ జానర్ ను టచ్ చేశారు. ఆ ప్రాజెక్ట్ లో మదర్ సెంటిమెంట్ తో పాటు ఎమోషనల్ జోన్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లోనూ టైమ్ మిషన్ అనే పాయింట్ బయటకు రావడంతో, శర్వా మరోసారి అదే జానర్ లోకి అడుగు పెడుతున్నాడా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో మొదలైంది.
అయితే గతంలో ఎమోషన్ కు స్కోప్ ఉంటే, ఈసారి దర్శకుడి మార్కు ఎంటర్‌టైన్మెంట్ ఉంటుందేమో అనే ఆలోచన కూడా వస్తోంది. మరోవైపు శ్రీను వైట్ల పాస్ట్ ఫిలిమ్స్ ను ఒకసారి పరిశీలిస్తే ఆయన శైలికి తగ్గట్టుగా విభిన్నమైన కామెడీ ట్రాక్స్ ను డిజైన్ చేయడంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ నటించిన 'బాద్ షా' సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్ ను అమాయకుడిని చేసి "డ్రీమ్ మెషిన్" అనే ఒక ఫేక్ కాన్సెప్ట్ ను క్రియేట్ చేసి థియేటర్లలో పెద్ద ఎత్తున నవ్వులు పూయించారు. ఆ సీన్స్ అప్పట్లో సినిమాకి మెయిన్ హైలైట్స్ లో ఒకటిగా నిలిచాయి.ఇప్పుడు శర్వా తో కూడా నిజంగానే ప్రాపర్ సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తో కూడిన టైమ్ మిషన్ కథ ఉంటుందా, లేదంటే బాద్ షా తరహాలోనే ఏదైనా ఫిక్షనల్ సెటప్ లేదా కామెడీ డివైజ్ క్రియేట్ చేసి దాని చుట్టూ ఫన్ నడిపిస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. శ్రీను వైట్ల మార్కు ప్రెసెంట్ చేసే పద్ధతి తెలిసిన వాళ్లు మాత్రం, ఈ పాయింట్ ను సీరియస్ కథగా కాకుండా తన స్టైల్ లోనే ఎంటర్‌టైన్మెంట్ కు వాడుకునే ఛాన్స్ ఉందేమో అనుకుంటారు.ఒకవేళ నిజంగానే కామెడీ డివైజ్ చుట్టూ కాకుండా ప్రాపర్ టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నడిచినా, శ్రీను వైట్ల శైలిలో సిట్యువేషనల్ హ్యూమర్ కు మంచి స్కోప్ దొరికే అవకాశం ఉంటుంది. శర్వానంద్ టైమింగ్ కి, శ్రీను వైట్ల కామెడీ ఐడియాలకు తోడు ఈ కొత్త బ్యాక్ డ్రాప్ కూడా తోడైతే అవుట్ పుట్ డిఫరెంట్ గా వచ్చే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్ట్ లో నిజంగానే ఏదైనా టైమ్ ట్రావెల్ ఎలిమెంట్ ఉందా లేక శ్రీను వైట్ల తన పాత ఫార్ములాలోనే ఏదైనా ఫేక్ కన్ఫ్యూజన్ డ్రామా సెట్ చేశారా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# జాన్వీ - రష్మిక కాంబోలో ట్విస్ట్.. 'రాకా'లో సీక్రెట్ ఏంటి?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతోన్న పవర్ ఫుల్ పాన్ వరల్డ్ సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ 'రాకా'. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రతీ చిన్న వార్త నెట్టింట క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల పాత్రలకు సంబంధించిన ఆసక్తికర వివరాలు లీకై సోషల్ మీడియాలో విపరీతమైన క్యూరియాసిటీని పెంచేస్తున్నాయి. ఆ లేటెస్ట్ విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గిరిజన రాణిగా జాన్వీ కపూర్:**
ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో జాన్వీ కపూర్ ఒక పవర్‌ఫుల్ గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించబోతుందట. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన రోల్ అని టాక్. ఇక ఇప్పటివరకు గ్లామరస్ పాత్రల్లోనే మెరిసిన జాన్వీ, ఈ సినిమాలో చాలా విభిన్న పాత్రతో అలరించనుందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**రక్షకురాలిగా రష్మిక మందన్న:**
మరోవైపు రష్మిక మందన్న కూడా ఈ సినిమాలో ఓ ప్రత్యేకమైన రోల్ చేయబోతోందని సమాచారం. కథానాయకుడికి ఒక గైడ్‌గా, రక్షకురాలిగా వ్యవహరించే పాత్రలో రష్మిక కనిపించనుందట. సెంట్రల్ స్టోరీలైన్‌తో ఈమె పాత్రకు బలమైన కనెక్షన్ ఉండబోతోందని లీక్డ్ వార్తలు చెబుతున్నాయి. ఇక ఇప్పటివరకు చూడని డిఫరెంట్ లుక్స్‌లో ఈ ఇద్దరు భామలు అదరగొట్టబోతున్నారని టాక్.

**మ్యూజిక్ అండ్ షూటింగ్ అప్‌డేట్:**
ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో వేసిన భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ అల్లు అర్జున్, దీపికా పదుకొణె కాంబినేషన్ సీన్లను చిత్రీకరిస్తున్నారు. ఇక ఈ భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంగ్ సంగీతం అందిస్తున్నారు. బిగ్గెస్ట్ కాస్టింగ్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా మారింది.

**సైన్స్ ఫిక్షన్ విత్ మైథాలజీ ట్విస్ట్:**
'రాకా' అంటే నిండు పౌర్ణమి అనే అర్థం ఉంది. చీకటి నుంచి వెలుగును నింపే యోధుడిగా అల్లు అర్జున్ కనిపించబోతున్నారని, సైన్స్ ఫిక్షన్ కథకి అట్లీ మైథలాజికల్ టచ్ ఇస్తున్నారని నెట్టింట రకరకాల థియరీలు వైరల్ అవుతున్నాయి.
ఇక రోజుకో కొత్త వార్త బయటకు వస్తుండటంతో ఈ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందోనని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.
జాన్వీ కపూర్, రష్మిక మందన్నల రోల్స్‌పై వస్తున్న కథనాలపై చిత్రబృందం ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే అట్లీ విజన్, బన్నీ ఊరమాస్ క్రేజ్ తోడు కావడంతో 'రాకా' సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965